నేటి కందం- నేటికి అందం

పోలింగు బూతు లందున
కూలింగును ప్రజలకు సమకూర్చుట కొరకై
మేలగు పచ్చ దనంబును
పాలకు లందించినారు పరిపూర్ణముగన్ !!

(ఎన్నికలు జరుగుతున్న పోలింగు బూతులలో ప్రజా సౌకర్యం కొరకు పాలకులు ఇకో ఫ్రంట్లీగా పచ్చదనాన్ని అత్యంత సుందరంగా ఏర్పాటు చేశారు.)



-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



చురక

శ్రామిక జన హక్కులన్ని
చంప వస్తే దుష్ట కీడు
లేబర్ కోడుల రద్దుకు
లేచే సమ్మె పొద్దు నేడు
సర్కారు కార్పోరేటర్ల
సంరక్షణ కొరకు మొగ్గి
సంపద సృష్టించే వాళ్ల
చేస్తుంది బ్రతుకు బుగ్గి



-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 13-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:32 సంచిక:153 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణలో నేనే రాజు.. నేనే మంత్రి: సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తెలంగాణలో తానే రాజు తానే మంత్రినని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాను ఎవరితోనూ పోల్చుకోనని.. తనకు ఎవరూ పోటీ కారన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం నాడు సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా 2029లో జమిలి ఎన్నికలు రానున్నాయని ఆయన జోస్యం చెప్పారు. పదిన్నరేళ్ల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వడంపై తన మద్దతు ఉంటుందన స్పష్టం చేశారు. త్వరలోనే హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎంత నష్టం జరిగిందో.. అంచనా కోసం కమిటీకి బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. కమిటీ నివేదిక అందిన తర్వాతే కాళేశ్వరంపై ఆలోచిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్రాన్ని కోరామన్నారు రేవంత్ రెడ్డి. కానీ ఈ అంశాన్ని కేంద్రం పెండింగ్‌లో పెట్టిందని తెలిపారు. ఈ అంశంలో సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో మూడు పిల్లర్లు మాత్రమే కూలాయని చెప్పడం పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్ట్ లోపల బాంబు పెడితే పైన పేలుతుంది.. కింద కూలదని స్పష్టం చేశారు. మూడు పిల్లర్లా?.. ముప్పయ్ పిల్లర్లా? అనేది కమిటీ నిర్ధారించిన తర్వాత చెబుతామని చెప్పారు. కృష్ణా జలాలపై తాము అడిగినవన్నీ ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి సైతం సహకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కవిత పార్టీ గురించి తమకు తెలియదన్నారు.

ఎన్టీఆర్ జాతీయ నాయకుడని.. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు.. జాతీయ సొత్తు అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తాను వ్యక్తిగతంగా డిమాండ్ చేస్తున్నానన్నారు. ఎన్టీఆర్ గురించి ఎవరైనా తక్కువగా మాట్లాడితే వారంతా మూర్ఖులు ఎవరు ఉండరన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దత్తపుత్రుడని పునరుద్ఘాటించారు. కాళేశ్వరంపై 48 గంటల్లో విచారణ చేయిస్తామని కిషన్ రెడ్డి గతంలో ప్రకటించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకూ సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించలేదంటూ కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరంపై తాము నేరుగా సీబీఐ డైరెక్టర్‌కు లేఖ రాశామని వివరించారు.

ఆయన విచారణ తర్వాతే.. ఒక్కొక్కరికీ నోటీసులు: సీఎం రేవంత్

జడ్జీలు, జర్నలిస్టులు, రాజకీయ నేతల ఫోన్లు సైతం ట్యాప్ చేశారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కారకుడు ప్రభాకర్‌రావు 20 నెలలపాటు విదేశాలకు పారిపోయారని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాలతోనే ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును స్వదేశానికి తీసుకొచ్చామని వివరించారు. ప్రభాకర్‌రావు విచారణ తర్వాతే ఒక్కొక్కరికీ సిట్ నోటీసులు జారీ చేస్తోందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్ఐబీలో కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును తెలంగాణ హైకోర్టు.. సుమోటోగా స్వీకరించి విచారణ చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8తి (ఖ8తి) విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి.

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు.

ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# కొత్త ఎయిర్‌పోర్టులపై కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సీఎం రేవంత్ చర్చ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు సీఎం. ఈ భేటీలో మామునూరు, కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామునూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు.

అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు.

ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రాజకీయ పార్టీని స్థాపిస్తా

## నా పక్కన పైరవీకారులు లేరు.. ఉద్యమకారులే ఉన్నారు: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాజకీయ పార్టీని తాను కచ్చితంగా స్థాపిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ పేరుతోనే పార్టీ ఉంటుందని పేర్కొన్నారు. జాగృతి రాజకీయ శక్తిగా మారుతుందని తెలిపారు. స్వీయ అస్థిత్వం, ఉద్యమ ఆకాంక్షలు, తెలంగాణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసమే రాజకీయ పార్టీని స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ పార్టీ పక్కా రాజకీయ పార్టీగా ఉండదని కుండబద్దలు కొట్టారు. రాజకీయ పార్టీ స్థాపిస్తానంటే.. తనపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కవిత.

తన పక్కన పైరవీకారులు లేరని.. ఎప్పుడూ ఉద్యమకారులే ఉన్నారని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు కవిత. గురువారం నాడు బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. ఉద్యమకారులను పట్టించుకోలేదు కాబట్టే ఆ పెద్ద మనిషి అధికారం కోల్పోయారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని పరోక్షంగా విమర్శించారు.

గత పాలకులు అహంకారం ఎక్కువై ఓడిపోయారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై విమర్శలు సంధించారు. కేసీఆర్ హయాంలో అసెంబ్లీ ముందు ఉద్యమకారుడు ఆత్మాహుతి చేసుకుని చనిపోయాడన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సైతం ఉద్యమకారులు బంగ్లా నుంచి బయటకు గుంజుతారని జోస్యం చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత 63 సీట్లతో అధికారం ఇస్తే.. అన్ని పార్టీలను విలీనం చేసుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఇక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో ప్రజాస్వామ్య విలువలు కాల రాయబడ్డాయన్నారు.

ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ ఎత్తేశారని.. సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే అరెస్టులు చేశారంటూ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్లో ఎవర్ని గెలిపించినా.. బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారన్న పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత.. చిన్న వారికి లాభం జరగలేదని తెలిపారు. కానీ మెగా కృష్ణారెడ్డి మాత్రమే కుబేరుడు అయ్యాడంటూ వ్యంగ్యంగా అన్నారు.

అలాగే ఉద్యమకారులకు న్యాయం చేసే బాధ్యత తీసుకోవాలంటూ ప్రొఫెసర్ కోదండరాంకు ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత సూచించారు. ప్రొ.కోదండరాం, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తదితరుల లాంటి వారి వల్లే సీఎం రేవంత్ రెడ్డిని ఉద్యమకారులు నమ్మారన్నారు. అయితే రెండేళ్లుగా ఎందుకు మాట్లాడటం లేదంటూ ప్రొ.కోదండరాంను ఈ సందర్భంగా కవిత సూటిగా ప్రశ్నించారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ సంక్షేమ బోర్డు ప్రకటన చేయాలంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఉద్యోగాల్లో 25 శాతం కోటాను ఉద్యమకారుల పిల్లలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌లో మరో భారీ మోసం..

హైదరాబాద్, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌లో మరో భారీ మోసం వెలుగు చూసింది. ఇన్‌వాయిస్ పేరుతో భారీ మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారు. దాంతో తీగ లాగితే డొంకంతా కదిలింది. వాణిజ్య పన్నుల శాఖ అధికారుల చేతివాటంతో దాదాపు రూ. 32 కోట్ల మేర మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సుమారు రూ. 75 కోట్లకు పైగా సరకులను ఇన్‌వాయిస్ లేకుండానే వాహనాల్లో తరలించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దాంతో ఈ కేసు దర్యాప్తును సీసీఎస్‌కు హైదరాబాద్ పోలీసులు అప్పగించారు. దీనిప సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎప్పటిలాగానే సాధారణ వాహనాల తనిఖీలు పోలీసులు చేపట్టారు. దీంతో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి.

# సార్వత్రిక సమ్మెలో ఎల్ఐసి ఉద్యోగులు



నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 12 : దేశవ్యాప్తంగా గురువారం జరిగిన కార్మికుల సమ్మెలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఐసి బ్రాంచ్ 1, 2 కార్యాలయాల వద్ద ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐసిఈయు) ఆధ్వర్యంలో ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా బ్రాంచ్ లలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకుడు నలపరాజు సైదులు, ఐసిఈయు సికింద్రాబాద్ బేస్ యూనిట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ గద్దం నవీన్ దాస్ సమ్మెకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చినటువంటి పిలుపును ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ బలపరుస్తూ సమ్మెలో పాల్గొనడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రజల ఆశలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులు అనుమతించినటువంటి చట్టాన్ని రద్దు చేయాలని, ఎల్..ఐ.సి.లో క్లాస్ 3, క్లాస్ 4 నియామకాలను తక్షణమే చేపట్టాలని, ఎల్ఐసిలో 01.04.2010 తర్వాత చేరినటువంటి ఉద్యోగులందరికీ కూడా నూతన పెన్షన్ పథకాన్ని అమలు చేస్తున్నారని, దానిని రద్దుచేసి 1995 గ్యారెంటీ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 1996 నోటిఫికేషన్ ద్వారా ఎల్ఐసిలో చేరిన ఉద్యోగులందరికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ 57 అనుసరించి వారందరికీ 1995 గ్యారెంటీ పెన్షన్ వర్తింపజేయాలన్నారు. అదేవిధంగా ఏఐఐఈఏకు గుర్తింపుని ఇవ్వాలని, ఎల్.ఐ.సి. యాజమాన్యం యూనియన్లతో క్రమబద్ధంగా చర్చలు జరపాలన్నారు. బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను విరమించుకోవాలన్నారు. ఐడిబిఐ బ్యాంకును ప్రైవేట్ పరం చేయాలని చూడడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎల్ఐసి ని బలహీనపరచాలని చూస్తున్న అన్ని విషయాలను వ్యతిరేకిస్తూ ఈ బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని వివరించారు. సమ్మెకు ఎల్ఐసి ఏజెంట్ల సంఘం, ఏఓఐ, లియాఫీ, క్లాస్ 1, 2 ఆఫీసర్స్ హర్షవర్ధన్, గురుమూర్తి, వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆయా బ్రాంచ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు వెంకన్న, ఏ.కరుణాకర్ రావు, ఐతగోని లక్ష్మీనారాయణ, రమేష్, ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ మల్లేశం, సహాయ కార్యదర్శులు వింజమూరి వెంకటేశం, లెల్లెల శ్రీనివాసులు, కోశాధికారి జిన్నా శ్రీనివాస్ రెడ్డి, ఐసిఈయు నాయకులు ఎరుకల యాదగిరి, క్రాంతికుమార్, ఏ.యాదగిరి, కర్నాటి సత్యనారాయణ, పల్లపు లింగయ్య, యన్.సందీప్, యస్.యాదగిరి, డి.అంజయ్య, ఎం రామకృష్ణ, కే.వెంకటేశం, ఎల్.రామ కృష్ణ, బి.సుధాకర్, లక్ష్మయ్య, అఫ్సర్ ఖాన్, వరాంకుశం గోపికృష్ణ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓఐ బ్రాంచ్ 1 అధ్యక్ష, కార్యదర్శులు దారం వెంకన్న, సుంకి దేవేందర్, లియాఫీ నాయకులు ఈదులకంటి యాదయ్య, రావుల వీరయ్య, ఏజెంట్ల నాయకులు ధనుంజయరావు, శివశంకర్, బోగరి వెంకన్న, అంకూరి పృథ్వీరాజ్ లతో పాటు విశ్రాంత ఉద్యోగులు వేముల కృష్ణయ్య, స్వామి, ఏజెంట్ల సమాఖ్య ఏఓఐ డివిజన్ అధ్యక్షులు నలవరాజు సైదులు, దారం వెంకన్న, సంగెం వెంకటేశ్వర్లు, ఎన్. మహేశ్వరి, సుంకి దేవేందర్ సంఘీభావం ప్రకటించారు.

# కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై కేసు నమోదు

సంగారెడ్డి, ఫిబ్రవరి 12: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిపై (అనీనిణతీవబబ ఒవజీటవతీ ఏజీణణజీ ఖీవటటఎ) సంగారెడ్డి పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులకు ఆటంకం కలిగించారంటూ ఆయనపై కేసు నమోదు చేశారు పోలీసులు. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో బీఎన్ఎస్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది.

నిన్న (బుధవారం) సంగారెడ్డి పోలింగ్ బూత్ వద్ద జరిగిన సంఘటనపై ప్రెస్‌నోట్‌లో వివరణ ఇచ్చారు జగ్గారెడ్డి. నిన్న సంగారెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద కాంగ్రెస్ నాయకుడిని సీఐ గల్లా పట్టుకొని ఈడ్చుకొచ్చి కొట్టారని తెలిపారు. తన పార్టీ నాయకుడిని రక్షించుకోవడానికి బూత్‌కు వెళ్లి సీఐని తిట్టాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి మద్దతుగా సీఐ... తమ పార్టీ నాయకుడిని అవమానించారని తెలిపారు. కావాలని లా అండ్ ఆర్డర్ దెబ్బతినేట్లు చేసిన సీఐని తిట్టడం జరిగిందని జగ్గారెడ్డి వివరించారు.

ఈ విషయంపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చుని.. కానీ పది మంది మధ్యలో తమ పార్టీ నాయకుడికి సీఐ చేసిన అవమానం పోగొట్టడానికి బూత్ దగ్గరకు వెళ్లాల్సి వచ్చిందని జగ్గారెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనలను సీఐ లేదా తాను ఉల్లంఘించినా.. అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు.

# నెల్లూరులో రాకెట్ పరిశోధనా కేంద్రం.. ప్రభుత్వంతో కీలక ఒప్పందం

నెల్లూరు, ఫిబ్రవరి 12: దుత్తలూరు మండలంలో రాకెట్ పరిశోధనా కేంద్రం (స్పేస్) ఏర్పాటు చేయడానికి ప్రీమియం ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.1000 కోట్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో (ంఖ ఉనీలబి) కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాకెట్, స్పేస్ సంబంధిత కార్యకలాపాలకు సంబంధించిన అభివృద్ధి జరగనుంది. గతంలో రాకెట్ పరిశోధన కేంద్రం స్థాపనకు రాచవారిపల్లి, బ్రహ్మేశ్వరం రెవెన్యూ పరిధిలోని భూములను నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు.

ఈ రాకెట్ పరిశోధన కేంద్రం స్థాపనతో ఆ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా పెరగనున్నాయి. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభించే అవకాశం ఉంది. ఉదయగిరి నియోజకవర్గం కూడా మరింత వేగంగా అభివృద్ధి చెందనుంది. పరిశ్రమల స్థాపన ద్వారా ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఊతం లభించనుంది.




# సామాన్యుడి ఆత్మీయ నేస్తం రేడియో

## (13 ఫిబ్రవరి "ప్రపంచ రేడియో దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచ మానవాళికి ఆత్మీయ నేస్తంగా గత 130 ఏండ్ల నుంచి సమాచార వినోద విజ్ఞాన క్రీడా సమకాలీన వార్తలను ఇంటింటి చేర్చుతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణంగా రేడియో అమూల్య సేవలను అందిస్తున్నది. టెలివిజన్, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ రాకతో రేడియో వినియోగం కొంత తగ్గినా, నేటికీ మారుమూల మానవాళి మనసులను సహితం దోస్తున్న ఉపకరణం రేడియో మాత్రమే. నమ్మకానికి పెట్టింది పేరు మన రేడియో. సాపేక్షంగా చవకైన సాధనంగా రేడియో ప్రపంచ వార్తలను క్షణాల్లో అందిస్తూ, సహజ/మానవ తప్పిద విపత్తుల సమయంలో ప్రజలకు విలువైన సమాచారాన్ని అందిస్తున్న రేడియో ప్రాధాన్యం ఎన్నటికీ చెక్కుచెదరదు.

వాహన ప్రయాణ సమయాల్లో మనందరికీ ఉపయోగకరమైన రేడియో మన నిత్య స్నేహితుడిగా వ్యవహరిస్తున్నది.

### రేడియో ఆవిష్కరణ - అనేక ప్రయోజనాలు:

1895లో ఇటాలియన్ గుల్గిమో మార్కోనీ ఆవిష్కరించిన రేడియో కాలక్రమంలో 1919లో అమెరికాలో తొలి రేడియో స్టేషన్ ప్రారంభం కావడం, 1939లో ఎఫ్ఎం రేడియో ప్రసారాలు ప్రారంభం అయ్యాయి. 1994లో డిజిటల్ రంగులు అద్దుకోని 24 - గంటల సమాచార వితరణ ప్రసారాలు చేస్తున్న రేడియో నేటికీ ప్రతి ఇంట్లో మారుమోగుతానే ఉన్నది. ప్రపంచవ్యాప్త సమాచారం, విద్య, వైజ్ఞానిక, వ్యవసాయ, వినోద, వాతావరణ హెచ్చరికలు, స్థానిక వార్తలు, సంగీతం, లలిత గీతాలు, క్రీడా విశేషాలు, రన్నింగ్ కామెంటరీలు, చర్చలు, మార్కెటింగ్ అంశాలు, సమకాలీన సమస్యలు లాంటి అనేక అంశాలను నిత్యం మన వద్దకు చేర్చుతున్న రేడియో ప్రయోజనాలు అనంతం.

### ప్రపంచ రేడియో దినోత్సవం-2026:

2011లో యునెస్కో చొరవ, ప్రతిపాదనలతో 2012 నుంచి ఐరాస సభ్య దేశాలు ప్రతి ఏట 13 ఫిబ్రవరి రోజున "ప్రపంచ రేడియో దినోత్సవం (వరల్డ్ రేడియో డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రేడియో విలువను అవగాహన పరచడం, ఎఫ్ఎం లాంటి నవ్య టెక్నాలజీలను అందిపుచ్చుకొని అవసర మార్పులు చేసుకుంటూ నేటికీ రేడియో తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నది. ప్రపంచ రేడియో దినోత్సవం వేదికగా స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ రేడియో ప్రసారాలు నిర్విరామంగా కొనసాగడాన్ని ప్రజలకు అవగాహన పరచడం కూడా జరుగుతుంది. అంతర్జాల డిజిటల్ టెక్నాలజీలను అందిపుచ్చుకొని వాతావరణ సమాచారాన్ని, వాతావరణ మార్పుల కట్టడికి నడుంబించిన మన నమ్మకమైనా మిత్రుడు రేడియో అంటూ ఏకరువు పెట్టడం కూడా జరుగుతుంది.

### ప్రపంచ రేడియో దినోత్సవం-2026 ఇతివృత్తం:

ప్రపంచ మానవాళినా ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాతావరణ ప్రతుల మార్పులను ప్రజల చెత్తకు చేర్చుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వాతావరణ స్థాపన, పౌర సమాజ పాత్రను సహితం వివరించడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో రేడియో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న వేళ ప్రపంచ రేడియో దినం-2026 ఇతివృత్తంగా "రేడియో - కృత్రిమ మేధ (రేడియో అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రపంచ రేడియో దినం వేదికగా కార్యశాలలు, వెబినార్లు, సదస్సులు, చర్చలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యా వైజ్ఞానిక సమావేశాలు లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించాలి.

నేటి ఆధునిక డిజిటల్-ఏఐ యుగంలో కూడా రేడియో అవసర మార్పులు చేసుకుంటూ మానవాళి ప్రియ విశ్వాస నేస్తంగా రేడియో సేవలు అందిస్తున్న వేళ అందరికీ ప్రపంచ రేడియో దినోత్సవ శుభాకాంక్షలను తెలుపుకుందాం, రేడియో ప్రసారాలతో ప్రయోజనం పొందుదాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఆయుర్వేదాన్ని ప్రధాన ఆరోగ్య బీమా వ్యవస్థతో అనుసంధానించటంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సంస్థ ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ), జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ) మధ్య ఉమ్మడి జాబితా నమోదుపై న్యూఢిల్లీలో 10 ఫిబ్రవరి 2026న అవగాహనా ఒప్పందం (ఏంఓయూ) కుదిరింది.

ఈ ఒప్పందం ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ పరిధిలోని మొత్తం 32 సాధారణ బీమా సంస్థలతో ఏఐఐఏ అనుసంధానమవటంతో అర్హత గల ఆయుర్వేద సేవలకు రోగులు నగదు రహిత చికిత్స సౌకర్యాన్ని పొందవచ్చు.

ఆయుష్ హెల్త్ ఇన్సూరెన్స్ నిపుణుల బృందం ఛైర్మన్ ప్రొఫెసర్ బెజోన్ కుమార్ మిశ్రా సమక్షంలో ఏఐఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ (వైద్య) పి.కె. ప్రజాపతి, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ డైరెక్టర్ (ఆరోగ్యం) శ్రీ సెగర్ సంపత్ కుమార్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ కార్యక్రమానికి ఏఐఐఏ డీన్ (పీహెచ్‌డీ) ప్రొఫెసర్ (డాక్టర్) మహేశ్ వ్యాస్, డీన్ (పీజీ) ప్రొఫెసర్ (డాక్టర్) ఆర్.కె. యాదవ్, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ (డీఎంఎస్) డాక్టర్ అల్కా కపూర్, ఇతర సీనియర్ అధ్యాపకులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏఐఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ (వైద్య) పి.కె. ప్రజాపతి మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌తో అనుబంధమున్న 32 బీమా కంపెనీల ద్వారా ఏఐఐఏలో నగదు రహిత చికిత్సను అందించవచ్చని తెలిపారు. ఆయుష్ మంత్రిత్వ శాఖకు, ఏఐఐఏ బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఒప్పందం వల్ల రోగులకు ఆయుర్వేద వైద్యానికి సంబంధించి సౌలభ్యం మెరుగుపడటంతో పాటు ఆర్థిక వెసులుబాటు, విశ్వాసం పెరుగుతాయని తద్వారా ఎంతో ప్రయోజకరమన్నారు.

ఆయుష్ హెల్త్ ఇన్సూరెన్స్ నిపుణుల కమిటీ ఛైర్మన్ ప్రొఫెసర్ బెజోన్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ.. ఏఐఐఏ బృందాన్ని అభినందించారు. ఒక ఆయుష్ సంస్థ, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌తో అధికారిక ఒప్పందం కుదుర్చుకోవటం దేశంలోనే తొలిసారని వెల్లడించారు. ఏఐఐఏలో అందుబాటులోకి వచ్చిన నగదు రహిత చికిత్స సౌకర్యం వల్ల రోగుల్లో నమ్మకం పెరుగుతుందని, ఎక్కువ మందికి సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది సంస్థపై విశ్వసనీయతను బలపరచటమే కాక, ఆయుష్ ఆరోగ్య సేవల స్థిరమైన వృద్ధికి దోహదపడుతుందన్నారు

ఈ సందర్భంగా ఆయుర్వేద చికిత్సలకు సంబంధించి బీమా మద్దతును సులభతరం చేసేందుకు ఆయుష్ మంత్రిత్వ శాఖ చేపట్టిన కీలక కార్యక్రమం గురించి ప్రొఫెసర్ మిశ్రా తెలిపారు. లబ్ధిదారులు బీమా సంబంధిత సందేహాలను తీర్చుకోవటానికి, ఆయుష్ ఇన్సూరెన్స్ కవరేజీపై అవగాహన పెంచటానికి ఆయుష్ మంత్రిత్వ శాఖ మొదటిసారిగా ప్రత్యేక ఆయుష్ హెల్త్ ఇన్సూరెన్స్ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది.

బీమా ప్రయోజనాలను పొందటంలో ఎదురయ్యే సమస్యలను తొలగించి, ఆయుష్ ఆరోగ్య సేవలను సులభంగా వినియోగించుకునేలా ప్రోత్సహించటమే ఈ హెల్ప్‌లైన్ ముఖ్య ఉద్దేశం.

భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద (ఏఐఐఏ) సంస్థ, ఆయుర్వేద రంగంలో అత్యున్నత సంస్థగా గుర్తింపు పొందింది. సంప్రదాయ ఆయుర్వేద విజ్ఞానాన్ని, ఆధునిక శాస్త్రీయ పురోగతితో అనుసంధానించటమే దీని ఉద్దేశం. వివిధ విభాగాల్లో పోస్టు గ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులను ఈ సంస్థ అందించటమే కాక, పరిశోధన, ఔషధాల అభివృద్ధి, ప్రామాణీకరణ, నాణ్యత, నియంత్రణ, ఔషధాల భద్రత, ఆయుర్వేద ఔషధాల శాస్త్రీయ ధ్రువీకరణ వంటి రంగాల్లో క్రియాశీలకంగా పాల్గొంటుంది.

ఏఐఐఏలో అధునాతన రోగ నిర్ధారణ సౌకర్యాలతో 200 పడకల రిఫరల్ ఆసుపత్రితో పాటు, 25 ప్రత్యేక విభాగాలు, 12 క్లినికల్ యూనిట్లు, 8 ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనా ప్రయోగశాలలు ఉన్నాయి. ఇవి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, బోధన, పరిశోధనలకు మద్దతిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఆయుర్వేదానికి ప్రచారం కల్పించేందుకు, పరిశోధనలను ప్రోత్సహించటానికి అంతర్జాతీయ సహకార కేంద్రాన్ని కూడా ఈ సంస్థ నిర్వహిస్తుంది.

ఇన్సూరెన్స్ చట్టం- 1938 లోని సెక్షన్ 64ఇ ప్రకారం ఏర్పాటైన చట్టబద్ధమైన సంస్థ జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్.. 2001 నుంచి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ, డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) ఆధ్వర్యంలో పనిచేస్తోంది. బీమా రంగంలో వేగంగా మారుతున్న ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాలను సమన్వయం చేయటంలో, ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో ఈ కౌన్సిల్ కీలక పాత్ర పోషిస్తుంది.

ఈ అవగాహనా ఒప్పందం.. భారతదేశంలో సమ్మిళిత, సమగ్ర, బీమా మద్దతులో ఆయుర్వేద ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించటంలో విప్లవాత్మక ముందడుగును సూచిస్తుంది. జాతీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఆయుష్ విధానాలను బలోపేతం చేయటానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ఇది స్పష్టం చేస్తుంది.

# మెడికల్ మాఫియాను అరికట్టాలి..



కర్నూల్, జనవరి 28: రాష్ట్రంలో పెట్రేగిపోతున్న మెడికల్ మాఫియాను అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాలని సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శులు ఎస్ మునెప్ప, ఎన్ లెనిన్ బాబు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథంలో డిమాండ్ చేశారు. ఈ రోజు స్థానిక సిఆర్ భవన్ లో ఈ నెల 14వ తేదిన రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ మాఫియాకు వ్యతిరేకంగా జరిగే ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునెప్ప, లెనిన్ బాబు, జగన్నాథంలు మాట్లాడుతూ చిన్న క్లినిక్ లో నుంచి కార్పొరేట్ హాస్పిటల్ వరకు, గల్లీ మందుల దుకాణాల నుంచి డయాగ్నోస్టిక్ సెంటర్ ల వరకు కమిషన్ల దందా పేదల ప్రజల నడ్డి విడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

నామమాత్రపు ఆరోగ్యశ్రీ సేవల వలన రోగులు ప్రవేట్ ఆసుపత్రి ను ఆశ్రయించాల్సి వస్తుందని దీనిని అదునుగా చేసుకొని మెడికల్ మాఫియా చలరేగిపోతుందని విమర్శించారు. వీటిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న పీపీపీ విధానం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేట్ శక్తుల చేతుల్లోకి వైద్యరంగం వెళ్లకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యంగా రాష్ట్రంలో కల్తీ మందుల వల్ల అర్హత లేని వ్యక్తులు వైద్య సేవలు చేయడం వల్ల ప్రజల ప్రాణాలకు హాని కలగడంతో పాటు వేలకు వేల ఖర్చు చేయాల్సి వస్తుందని వారు మండిపడ్డారు. మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మెడికల్ మాఫియా ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ మాఫియా ఆగడాలు అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 14వ తేదీన కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆందోళన నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శిలు సి మహేష్, డి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష, నగర అధ్యక్ష కార్యదర్శులు అభి, అశోక్, ప్రజాసంఘాల నాయకులు శ్రీకాంత్, అఖిల్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# చింతన్ శిబిర్‌ను ప్రారంభించనున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: 2026, ఫిబ్రవరి 11న ఔషధ మొక్కలపై చింతన్ శిబిర్‌ను ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ ఔషధ మొక్కల బోర్డు (ఎన్ఎంపీబీ) నిర్వహించనుంది. దీనిలో దేశంలో ఔషధ మొక్కల రంగానికి సంబంధించిన ముఖ్యమైన విధానాలు, పరిశోధన, అమలులో ఎదురవుతున్న సమస్యలపై దీనిలో చర్చిస్తారు.

ప్రారంభ కార్యక్రమానికి ఆయుష్ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్ రావ్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా గౌరవ అతిథిగా హాజరవుతారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఆర్థిక సలహాదారు శ్రీ హ్వైద అబ్బాన్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారు.

చింతన్ శిబిర్ అనంతరం బోర్డు సమావేశం జరుగుతుంది. ఆ తర్వాత జరిగే టెక్నికల్ సెషన్లు, ప్యానెల్ చర్చల్లో నిపుణులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొంటారు. ఔషధ మొక్కల రంగంలో విధాన నియమాలను బలోపేతం చేయడం.. పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, అమల్లో ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించడంపై చర్చల్లో ప్రధాన దృష్టి సారిస్తారు.

విధానపరమైన జోక్యం, పరిశోధనా పురోగతులు, సంస్థాగత బలోపేతానికి ఔషధ మొక్కల రంగంలో ప్రధాన విభాగాలను గుర్తించేలా వ్యూహాత్మక దిశను చింతన్ శిబిర్ అందిస్తుందని భావిస్తున్నారు. సాగు విస్తరణకు, పరిరక్షణకు, విలువ జోడింపునకు, మార్కెట్ అనుసంధానాన్ని అందించే సమన్వయపూర్వకమైన, భవిష్యత్తుకు తగిన ప్రణాళికను రూపొందించడంలో ఈ చర్చల ఫలితాలు సహకరిస్తాయి.

# భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిగజ ఈతగాళ్లు ..లైఫ్ గార్డులు అందుబాటులో..

## -పాతాళ గంగ వద్ద ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పరిశీలన..



శ్రీశైలం, ఫిబ్రవరి 12: నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిసున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలను గురువారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు.

స్నాన ఘట్టాల వద్ద పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా, రన్నింగ్ వాటర్ అందుబాటులో ఉందా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. దుస్తులు మార్చుకునే గదులు శుభ్రంగా ఉంచుతున్నారా ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారా.. అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నియమించిన గజ ఈతగాళ్లు లైఫ్ గార్డులు ఎంతమంది ఉన్నారు, వారు విధుల్లో నిరంతరం అందుబాటులో ఉన్నారా అనే విషయంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అవసరమైన భద్రతా ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణంలో సురక్షితంగా స్నానాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం విధుల్లో ఉండి పరిశుభ్రతను కాపాడాలని, తాగునీటి సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా సమన్వయంతో పనిచేసి, అన్ని మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

# ప్రశాంత వాతావరణంలో భక్తుల దర్శన ఏర్పాట్లు..

## -మహా శివరాత్రి రోజు సుమారు 1. 50 లక్షల మంది పైన భక్తులు వస్తారని అంచనా

## -భక్తులకు సౌకర్యాలతో పాటు పటిష్ట బందోబస్తు-జిల్లా ఎస్.పి

అమరావతి, ఫిబ్రవరి 12: నంద్యాల జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ సునీల్ షేరన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిన్నటి దినం బుధవారం సుమారు 63,596 మంది భక్తులు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు చేసుకోవటం జరిగిందన్నారు.

వీరిలో 14,803 మంది శివ స్వామి భక్తులు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్పర్శ దర్శనం చేసుకున్నారు. సుమారు 40,149 మంది దర్శనం చేసుకోగా వారిలో 11,515 మంది శివ స్వామి భక్తులు ఉన్నారు. నిన్నటి దినం కైలాస ద్వారం నుండి సుమారుగా 26 వెల మందికి పైగా భక్తులు కాలినడకన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి రావడం జరిగిందన్నారు. వారందరికీ అసౌకర్యం లేకుండా వైద్య సేవలతో పాటు ఆహారము నీళ్లు మొదలగు సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు.

శివరాత్రి పర్వదినం రోజున అనగా 15 వ తేదీన సుమారు 1.50 లక్షల మంది కన్నా ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని వారికి అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు శాంతి భద్రతలకు భంగం కలగకుండా సరిపడా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పాతాళ గంగా స్నానఘట్టాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాలు జరగకుండా బోట్లను గజ ఈతగాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అధిక సంఖ్యలో వచ్చి భక్తుల వాహనాలు ట్రాఫిక్ అంతరాయం లేకుండా బస్సులకు, కార్లకు రింగ్ రోడ్డు వద్ద ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దర్శనం కోసం భక్తులు ఇతరులకు ఇబ్బంది లేకుండా తమ వాహనాలను పోలీసు వారి సూచనలతో పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలుపుకోవాలని రోడ్డుకు ఇరువైపులా ఎట్టిపరిస్థితులలో వాహనాలు నిలుపరాదని విజ్ఞప్తి చేశారు.




# మస్యల పరిష్కారానికి చక్కని వేదిక గ్రామసభ

అమరావతి, ఫిబ్రవరి 12: గ్రామ సభలు నిర్వహించడం ద్వారా గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక అని చిన్నపోర్ల సర్పంచ్ గాండ్ల నిఖితప్రశాంత్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపోర్ల లో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు మంత్రితోరూ. 40 లక్షల నిధులు తీసుకువస్తానని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తానని గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తానని అన్నారు. ప్రజలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని రైతులు కూలీలు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆహ్వానము
భవానీ సాహిత్య వేదిక
సీతారాంపూర్ - కరీంనగర్



కవి, విశ్రాంత ఉపాధ్యాయులు
శ్రీ కసిరెడ్డి జలంధర్ రెడ్డి గారి
ప్రేమ రాగాలు
కవితా సంపుటి
పుస్తకావిష్కరణ సభ




తేది : 14.02.2026 రెండవ శనివారం ఉ॥ 10.00 గం॥లకు
వేదిక : గణాంక భవన్, కరీంనగర్.

సభాధ్యక్షులు :
డా. వైరాగ్యం ప్రభాకర్ గారు
అధ్యక్షులు, భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్.

ముఖ్య అతిథి & పుస్తక ఆవిష్కర్త :
శ్రీ సాదనాల వెంకటస్వామి నాయుడు గారు
ప్రముఖ కవి, నటులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డు గ్రహీత

విశిష్ట అతిథి :
డా. తన్నీరు సురేష్ గారు, సహాయ ఆచార్యులు,
ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాల, లక్షెట్టిపేట.

ఆత్మీయ అతిథులు :
శ్రీ ఎల్లటి తిరుపతి రెడ్డి గారు
ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానాచార్యులు
శ్రీ అన్నాడి గజేందర్ రెడ్డి గారు
ప్రముఖ కవి, విశ్రాంత ప్రధానాచార్యులు
శ్రీ కూకట్ల తిరుపతి గారు
ప్రముఖ కవి, తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షులు

ప్రధాన వక్త :
శ్రీమతి పెనుగొండ సరసిజ గారు
ప్రముఖ కవయిత్రి, తెరవే కరీంనగర్ జిల్లా మహిళా కార్యదర్శి

ఆహ్వానించువారు :
శ్రీమతి వి.యల్. భవాని
ప్రధాన కార్యదర్శి,
భవానీ సాహిత్య వేదిక, కరీంనగర్.

అందరూ ఆహ్వానితులే !

# నూతన వ్యవసాయ పద్ధతులు, డిజిటల్ సేవలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రభుత్వం రైతు ఆదాయాన్ని, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి నూతన వ్యవసాయ పద్ధతులు, డిజిటల్ సేవలను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం వివిధ చర్యలు చేపట్టింది. అవి:

జాతీయ సుస్థిర వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎస్ఏ) కింద సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి అనేక పథకాలు ప్రారంభించారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ (పీడీఎంసీ) పథకం ద్వారా బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటి పారుదల సాంకేతికతలను ఉపయోగించి భూస్థాయిలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. వర్షాధారిత ప్రాంతాల అభివృద్ధి పథకం సమగ్ర వ్యవసాయ వ్యవస్థలను ప్రోత్సహించి ఉత్పాదకతను పెంచడంతో పాటు వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రమాదాలను తగ్గించడంపై దృష్టి సారిస్తుంది. నేల ఆరోగ్యం, సారవంతం (ఫర్టిలిటీ) పథకం రసాయన ఎరువులను సముచితంగా ఉపయోగించడం ద్వారా సమగ్ర పోషకాల నిర్వహణను ప్రోత్సహిస్తుంది. సమీకృత ఉద్యానవన అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్), ఆగ్రో ఫారెస్ట్, నేషనల్ బాంబూ మిషన్ కూడా వ్యవసాయంలో వాతావరణాన్ని మార్పులను తట్టుకునే శక్తిని పెంపొందిస్తాయి. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీఐ)తోపాటు వాతావరణ ఆధారిత పునర్వ్యవస్థీకృత పంట బీమా పథకం ఊహించని ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇది ఆర్థిక సహాయం అందిస్తుంది. పంట నష్టానికి సమగ్ర బీమా రక్షణను అందిస్తుంది.

వ్యవసాయ యాంత్రీకరణపై ఉప-మిషన్ (ఎస్ఎంఏఎం) 2014-15 నుంచి తమిళనాడుతో సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ద్వారా అమలవుతోంది. ప్రస్తుతం ఈ పథకం కేంద్ర ప్రభుత్వ పథకమైన రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పరిధిలో కొనసాగుతోంది. "అందని వారికి చేరువ కావడం" ఈ పథకం ప్రధాన లక్ష్యం. అంటే చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులను కేంద్రంగా చేసుకుని వ్యవసాయ యాంత్రీకరణ ప్రయోజనాలను వారికి అందించడం. ఇందుకోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను ప్రోత్సహించడం, హైటెక్, అధిక విలువ కలిగిన వ్యవసాయ పరికరాల కేంద్రాలను సృష్టించడం, వివిధ రకాల వ్యవసాయ పనిముట్ల పంపిణీ, ప్రదర్శనలు, శిక్షణా కార్యక్రమాల ద్వారా రైతుల్లో, ఇతర భాగస్వాముల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది. ఈ పథకం కింద 2014-15 నుంచి 2025-26 (నేటి వరకు) కాలంలో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు రూ. 9,404.47 కోట్ల నిధులు విడుదల చేసింది. సబ్సిడీపై రైతులకు 21,61,202 యంత్రాలను పంపిణీ చేయగా.. 27,554 యంత్రాల అద్దె కేంద్రాలు 646 హైటెక్ కేంద్రాలు, 25,608 వ్యవసాయ యంత్రాల బ్యాంకులు ఏర్పాటు చేశారు. ఈ చర్యల ఫలితంగా వ్యవసాయ పనుల కోసం అవసరమైన వ్యవసాయ శక్తి లభ్యత 2013-14లో హెక్టారు కు 1.73 కిలోవాట్లు ఉండగా 2018-19 నాటికి అది 2.49 కిలోవాట్లకు పెరిగింది.

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన (డీడీవైకే)ను కేంద్ర బడ్జెట్ 2025-26లో ప్రకటించారు. ఈ పథకాన్ని 2025 అక్టోబర్ 11న అధికారికంగా ప్రారంభించి.. 100 జిల్లాలకు విస్తరించారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంట వైవిధ్యీకరణ, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబనను ప్రోత్సహించడం ఈ పథకం ముఖ్య లక్ష్యం. గ్రామ పంచాయతీ, మండల స్థాయిల్లో కోత అనంతరల నిల్వ సౌకర్యాలను పెంపొందించడం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, అలాగే రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల లభ్యతను సులభతరం చేయడం ప్రధాన ఉద్దేశం. ఈ పథకాన్ని 11 ప్రభుత్వ శాఖ లకు చెందిన 36 ప్రస్తుత కేంద్ర పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన 100 డీడీకేవై జిల్లాల్లో అమలు చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా దేశంలో డిజిటల్ మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిలో ముఖ్యమైనవి కింది విధంగా ఉన్నాయి.

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద వ్యవసాయం కోసం డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా అగ్రిస్టాక్, కృషి నిర్ణయ సహాయక వ్యవస్థ, సమగ్ర భూసారం, నేల ప్రొఫైల్ మ్యాప్, దేశంలో బలమైన వ్యవసాయ వ్యవస్థను ప్రారంభించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఇతర ఐటీ కార్యక్రమాలు ఉన్నాయి. వీటి ద్వారా రైతు కేంద్రీకృతమైన వినూత్న డిజిటల్ పరిష్కారాలను ప్రోత్సహించడమే కాకుండా వాటిని మరింత నమ్మదగినవిగా మారుస్తాయి. దీనివల్ల పంటకు సంబంధించిన సమాచారం రైతులకు సరైన సమయంలో అందుబాటులోకి వస్తుంది. అగ్రిస్టాక్ అనే డిజిటల్ మౌలిక సదుపాయం వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు ప్రాథమిక రిజిస్ట్రీలు లేదా డేటాబేస్‌లను కలిగి ఉంటుంది. అవి జియో-రిఫరెన్స్ విలేజ్ మ్యాప్‌లు, క్రాప్ సోన్ రిజిస్ట్రీ, రైతుల రిజిస్ట్రీ. వీటన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్వయంగా రూపొందించి నిర్వహిస్తాయి. ఇది రైతు గుర్తింపు, భూమి వివరాలు, పంటల సమాచారం కోసం ఒకే ఖచ్చితమైన సమాచార వనరుగా పనిచేస్తాయి.

రైతు గుర్తింపు కార్డు ద్వారా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, కనీస మద్దతు ధర ఆధారిత కొనుగోళ్లు, రుణాల లభ్యత, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ప్రకృతి విపత్తు సహాయం వంటి ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) పథకాలతో సులభంగా సమన్వయం సాధ్యమవుతుంది. 04-02-2026 నాటికి దేశవ్యాప్తంగా 8.48 కోట్లకు పైగా రైతు గుర్తింపు కార్డులు కల్పించారు.

డిజిటల్ పంట సర్వే ద్వారా ప్రతి పొలం స్థాయిలో ఏ పంట వేశారో స్పష్టంగా తెలుస్తుంది. దీనివల్ల వివిధ కాలాల్లో సాగు విధానాలను మెరుగ్గా అంచనా వేయడానికి వీలవుతుంది. ఈ సమాచారం ఆధారంగా పంట సేకరణ, ఎరువులు/విత్తనాల సరఫరా, రవాణా ఏర్పాట్లను ముందస్తుగా, ప్రణాళిక ద్వారా రూపొందించుకోవడానికి ప్రభుత్వానికి సాధ్యమవుతుంది.

కృషి నిర్ణయ సహాయక వ్యవస్థ అనేది శాటిలైట్ చిత్రాలు, వాతావరణం, నేల వంట వివరాలను భౌగోళిక సమాచార వ్యవస్థ ద్వారా అనుసంధానించే ఒక జియో-స్పేషియల్ ప్లాట్‌ఫామ్. ఇది వ్యవసాయ ప్రణాళికలు, నిర్ణయాలు తీసుకోవడంలో సహాయపడుతుంది. పంటలు, వాతావరణం, నేల స్వభావానికి సంబంధించిన నిర్దిష్టమైన సలహాలను రూపొందించడానికి ఉపయోగపడే ఒక విశ్లేషణాత్మక వేదికగా పనిచేస్తుంది.

కిసాన్ ఈ-మిత్ర అనేది కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ చాట్‌బాట్. ఇది ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించిన రైతుల ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి రూపొందించారు. ఈ వ్యవస్థ ప్రస్తుతం 11 ప్రాంతీయ భాషల్లో సేవలను అందిస్తోంది. భవిష్యత్తులో ఇతర ప్రభుత్వ పథకాలకు కూడా సహాయపడేలా దీనిని అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఇది రోజుకు సగటున 8,000కు పైగా రైతుల ప్రశ్నలకు సమాధానమిస్తోంది. ఇప్పటివరకు 95 లక్షలకుపైగా ప్రశ్నలకు సమాధానాలు అందించింది.జాతీయ తెగులు పర్యవేక్షణ వ్యవస్థ: వాతావరణ మార్పుల వల్ల పంట దిగుబడి తగ్గకుండా చూసేందుకు జాతీయ తెగులు నిఘా వ్యవస్థ పనిచేస్తుంది. ఇది పంటలలో తెగులు ఉధృతిని గుర్తించడానికి ఏఐ, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలను ఉపయోగిస్తుంది. దీనివల్ల సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టి పంటను ఆరోగ్యంగా ఉంచవచ్చు. ప్రస్తుతం 10,000 మందికి పైగా విస్తరణాధికారులు దీనిని ఉపయోగిస్తున్నారు. రైతులు తెగుళ్ల ఫోటోలను తీసి పంపడం ద్వారా పురుగుల దాడులను అరికట్టవచ్చు. పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చు. ప్రస్తు తం ఇది 65 రకాల పంటలు, 400 కంటే ఎక్కువ రకాల తెగుళ్ల సమాచారాన్ని అందిస్తోంది.

సాథి (విత్తన ప్రామాణికత ట్రేసబిలిటీ, హోలిస్టిక్ ఇన్వెంటరీ): ఇది విత్తనోత్పత్తి, నాణ్యత ధృవీకరణ, పంపిణీ, ట్రేసిబిలిటీని దేశవ్యాప్తంగా క్రమబద్ధీకరించే ఒక డిజిటల్ వేదిక. ఈ ప్రయత్నం జాతీయ విత్తన సీడ్ గ్రిడ్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది విత్తన రంగానికి చెందిన వాటాదా రులందరినీ ఒకే జాతీయ డిజిటల్ వేదిక కిందకు తీసుకువస్తుంది.

ఈ0 సమాచారాన్ని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ రామ్‌నాథ్ ఠాకూర్ నేడు లోక్‌సభలో ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో వెల్లడించారు.

# రూ. 16.10 లక్షల కోట్ల విలువైన 352 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అంచనా వేసిన పీఎం గతిశక్తి నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశంలో మౌలిక సదుపాయాల ప్రణాళిక, అభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే ఉద్దేశంతో పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ (పీఎంజీఎస్ ఎన్ఎంపీ) అక్టోబర్ 2021లో ప్రారంభించారు. పీఎం గతిశక్తి వ్యవస్థ కింద ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ (ఎన్ పీజీ).. కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక మౌలిక సదుపా యాల ప్రాజెక్టులను సమగ్రంగా పరిశీలిస్తుంది. సమీకృత ప్రణాళిక, మల్టీమోడాలిటీ, ఇంటర్-మోడాలిటీ, వివిధ శాఖల ప్రయత్నాల సమన్వయం, చివరి మైలు కనెక్టివిటీ, ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి, డేటా ఆధారిత నిర్ణయా లు వంటి అంశాలను చేపట్టడం ఈ గ్రూప్ ప్రధాన బాధ్యత. ఇప్పటి వరకు సుమారు రూ. 16.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 352 మౌలిక సదుపా యాల ప్రాజెక్టులను ఎన్ పీజీ యంత్రాంగం పరిశీలించింది. ఈ 352 ప్రాజెక్టులలో 201 మాత్రమే మంజూరయ్యాయి. వీటిలో ప్రస్తుతం 167 ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయి.

''2022-23 సంవత్సరానికి రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం" లోని రెండో భాగం (పీఎం గతిశక్తికి సంబంధించిన ఖర్చుల కోసం) కింద కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వ్యయ విభాగం రూ.5,000 కోట్లను కేటాయించింది. ఈ నిధులను రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో పంపిణీ చేస్తున్నారు. ఈ పథకం కింద ఆమోదించిన రాష్ట్రాల ప్రాజెక్టుల వివరాలు, కేటాయించిన నిధుల వివరాలు కూడా అందించారు.

పీఎం గతిశక్తి విధానం ద్వారా రూ.150 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ వ్యయంతో ప్రణాళికతో రూపొందించిన, పరిశీలించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సహా కేంద్ర రంగ ప్రాజెక్టుల పర్యవేక్షనను 'గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ' నిర్వహిస్తుంది.

ప్రాజెక్టుల పురోగతిని దశలవారీగా పర్యవేక్షించడం, సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, భారీ స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల (రూ. 500 కోట్లు, అంతకంటే ఎక్కువ వ్యయం కలిగినవి) అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ) అనే సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేశారు. సమస్యల పరిష్కారం, నిర్ణయాల వేగం పెంచేందుకు పీఎంజీ ప్రత్యేకమైన అయిదు అంచెల ఉన్నత స్థాయి విధానాన్ని అమలు చేసింది. దీని ద్వారా సమస్యలను సంబంధిత మంత్రి త్వ శాఖ స్థాయిలో పరిష్కరి ంచడం నుంచి మొదలుకొని అత్యంత సంక్లిష్టమైన సమస్యల పరిష్కారం కోసం ప్రగతి (ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్) ఫోరం వరకు విస్తరించింది. ఈ విధా నం సమీక్షా వ్యవస్థను సులభతరం చేయడమే కాకుండా, చేసిన పనిని మళ్లీ చేయడాన్ని కూడా నివారిస్తుంది. కీలకమైన సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించేలా చేస్తుంది. అడ్డంకులను తొలగించి, ప్రాజెక్టు లను సకాలంలో పూర్తి చేసేలా చూడటానికి పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్‌ను పీఎంజీతో అనుసంధానించారు. ఇది ప్రాజెక్టుల అమలులో ఎదురయ్యే సమస్యల పరిష్కారాన్ని, నియంత్రణ అడ్డంకులను తొలగించడాన్ని వేగవంతం చేసింది

# యూరియా కోసం పెట్టిన యాప్ రద్దు చేయాలి..

## -తాడికల్లో రోడ్డెక్కిన రైతన్నలు,



కరీంనగర్, జనవరి 12:తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాన్ని రైతులకు యూరియా కోసం ప్రవేశపెట్టిన సాఫ్ట్వేర్ , యాప్ ను రద్దు చేయాలని కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,మండలం తాడికల్ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. గురువారం తాడికల్ గ్రామంలో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేసి తాడికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చేరుకొని ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను దేశానికి వెన్నెముకగా దేశ పాలకులు రాష్ట్ర పాలకులు మీడియా ముందు, దినపత్రికల ముందు ప్రకటన చేయడమే తప్ప రైతు శ్రేయస్సు కోసం ఎలాంటి పథకాలను ప్రవేశపెట్టకుండా రైతులను నిర్లక్ష్యం చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పరిపంటలు సాగు చేసి యూరియా అంధక వేసిన పంటలు నష్టపోయే విధంగా రైతులను అధోగతి పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా అందించక చేసిన అప్పులు తీరేది ఎలా అని బోరునా విలపించారు. దేశంలో ఎక్కడ లని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వము యూరియా కోసము రూపొందించిన నూతన విధానాన్ని, యాప్ ను వెంటనే రద్దుచేసి, రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలతో యూరియా పంపిణీ చేసి వేసిన పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు నిర్లక్ష్యం చేస్తే రైతులందరం ఏకమై ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు కత్రం భాస్కర్ రెడ్డి : వేనేపల్లి చందర్ రావు



నల్గొండ, ఫిబ్రవరి 12: కోదాడ పబ్లిక్ క్లబ్ శాశ్వత సభ్యుడు కత్రం భాస్కర్ రెడ్డి మృతి బాధాకరమని, ఆయన జీవితం చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన భాస్కర్‌రెడ్డి సంతాప సభలో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాయం పట్టాభి రెడ్డి, బొల్లు రాంబాబు, క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేనేపల్లి మాట్లాడుతూ.. క్లబ్ అభివృద్ధిలో భాస్కర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. తాను ఏ బాధ్యత చేపట్టినప్పటికీ నిబద్ధతతో చేసేవారన్నారు. అనంతగిరి ప్రాథమిక సహకార కేంద్ర అభివృద్ధిలో ఆయన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేనేపల్లి సత్యనారాయణ, ఒరుగంటి రవి, కారుమంచి సత్యనారాయణ, గుండాపునేని వేణుగోపాలరావు, రావెళ్ల సీతారామయ్య, వేనేపల్లి శ్రీనివాసరావు, మాదాల వెంకటేశ్వరరావు, చింతలపాటి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టండి



ఆదిలాబాద్, జనవరి 12:ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు లబ్ధిదారులు వేగవంతంగా చేపట్టాలని ఊట్కూర్ ఇన్చార్జి ఎంపీడీవో కొండన్న, పెద్ద జట్రం సర్పంచ్ వాకిటి వెంకటేష్ అన్నారు. గురువారం నారాయణపేటజిల్లా

ఊట్కూర్ మండల పరిధిలోని పెద్ద జట్రం, అవసలోనిపల్లి, మొగ్దంపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేస్తే దశలవారీగా బిల్లులు చెల్లిస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించాలని లక్ష్యంతో ఉపాధి హామీ పథకం చేపట్టిందని కూలీలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో కూలీలు ఉదయం వేళా పనులు చేసుకోవాలన్నారు. నర్సరీలలో 100 శాతం మొక్కలు పెంచే విధంగా చూడాలని మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధిగా పాటించాలన్నారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు వెంటనే తొలగించి సంరక్షణ బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న వివిధ పనులు పారదర్శకంగా చేపట్టాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతంగా కొనసాగే విధంగా ప్రజలకు వివరించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈసీ మైపాల్ రెడ్డి, టి ఏ శివ కుమార్, పంచాయతీ కార్యదర్శి భవిత ఫీల్డ్ అసిస్టెంట్లు బాలప్ప, రాముతదితరులు పాల్గొన్నారు.

# 'బ్యాంక్ ఖాతాదారులకు ఈ-కేవైసీ తప్పనిసరి'

తుంగతుర్తి, ఫిబ్రవరి 12 : బ్యాంక్ ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ (వ-ఐజఅ) చేసుకోవాలని ఆర్బీఐ లీడ్ మేనేజర్ కోమిద, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగవరప్రసాద్ సూచించారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ-కేవైసీ చేసుకోని పక్షంలో బ్యాంక్ ఖాతాలు నిలిచిపోయే అవకాశం ఉందన్నారు. ఖాతాదారులు వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతికుమార్, పలు బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తరప్రదేశ్‌లో రామాయణ, బౌద్ధ సమాహారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: పర్యాటక ప్రాంతాలు, ఉత్పత్తుల అభివృద్ధి, పర్యాటక ప్రాంత ప్రణాళిక వంటివి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు (ఎస్‌జీ), కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలన (యూటీఏ) పరిధిలోకి వస్తాయి. పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రోత్సహిస్తూ 2014-15లో కేంద్ర పర్యాటక శాఖ ప్రారంభిం చిన స్వదేశ్ దర్శన్ పథకం ద్వారా రామాయణ సర్క్యూట్, బౌద్ధ సమాహారం వంటి నిర్దేశిత సమా హారాలను రూ.5,290.33 కోట్ల వ్యయంతో 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని రామాయణ, బౌద్ధ సమాహా రాల్లో స్వదేశ్ దర్శన్ పథకం ద్వారా మంజూరైన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి అయింది. స్వదేశ్ దర్శన్ పథకం ద్వారా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి మంజూరయిన రామా యణ, బౌద్ధ సమాహారంతో పా టు వివిధ వ్యూహాత్మక ప్రాజెక్టుల వివరాలు ఇక్కడ జతచేశారు.'రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయం (ఎస్ఏఎస్‌సీఐ) - అంతర్జాతీయ స్థాయిలో కీలక పర్యాటక కేం ద్రాల అభివృద్ధి' పథకం ద్వారా దేశవ్యాప్తంగా ప్రధాన పర్యాటక కేంద్రాల సమగ్ర అభివృద్ధికి భారత ప్రభుత్వం ప్రాజెక్టులను మంజూరు చేసింది. ఈ కేంద్రా లకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ చేయటం ఈ పథకం ప్రాథమిక లక్ష్యం. ఈ పథకం ద్వారా 'శ్రావస్తిలో సమగ్ర బౌద్ధ పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు'కు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.80.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

# వస్త్ర పరిశ్రమపై ప్రభావం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశీయ వస్త్ర, దుస్తుల పరిశ్రమ పోటీతత్వాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల కారణంగా గతేడాదితో పోల్చితే 2025 ఏప్రిల్-డిసెంబర్ మధ్య రెడీమేడ్ గార్మెంట్స్‌తో సహా వస్త్ర, దుస్తుల రంగంలో దిగుమతులపై భారత్ ఆధారపడటం 13.9% తగ్గింది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ నుంచి భారత్ కు వచ్చిన రెడీమేడ్ గార్మెంట్స్ సహా వస్త్ర, దుస్తుల దిగుమతులు 705.4 మిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

2024లో భారత్ ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద వస్త్ర, దుస్తుల ఎగుమతిదారుగా నిలిచింది. 2025 ఏప్రిల్-డిసెంబర్ కాలంలో భారత్ మొత్తం 27,312.7 మిలియన్ డాలర్ల విలువైన వస్త్ర, దుస్తులను ఎగుమతి చేసిది. ఈ కాలంలో భారత వస్త్ర, దుస్తుల ఎగుమతులు 100కిపైగా దేశాల్లో వృద్ధిని నమోదు చేశాయి. ఇది మెరుగైన మార్కెట్ విస్తరణను, ఎగుమతి వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోంది. వస్త్ర, దుస్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి, ప్రపంచ పోటీతత్వాన్ని పెంచడానికి భారత ప్రభుత్వం అనేక కీలక విధానాలు, కార్యక్రమాలను అమలు చేసింది.భారత్ మొత్తం 16 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చు కుంది. వీటిలో ఇటీవల సంతకా లు చేసిన భారత్-ఒమన్ ఎఫ్ టీఏ కూడా ఉంది. అలాగే న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్‌తో ఒప్పంద చర్చలను భారత్ విజయ వంతంగా పూర్తి చేసింది. ఈ ఒప్పందాలు ద్వారా టారిఫ్, నాన్ -టారిఫ్ అడ్డంకులను తగ్గించ డం, వాణిజ్య ప్రక్రియలను సుల భతరం చేయడం, నిర్మాణా త్మక ఇబ్బందులను పరిష్కరిం చడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. భాగ స్వామ్య దేశాల మార్కెట్లలో భారత ఎగుమతులకు మెరుగైన అవకా శాలు లభించడమే కాకుం డా పోటీతత్వం కూడా పెరుగుతుంది.

దేశవ్యాప్తంగా ఆధునిక, సమగ్ర, ప్రపంచ స్థాయి వస్త్ర మౌలిక సదుపాయాలను కల్పిం చేందుకు పీఎం మెగా ఇంటిగ్రే టెడ్ టెక్స్‌టైల్ రీజియన్స్ అండ్ అపెరెల్ (పీఎం మిత్రా) పార్కుల పథకం అమలు చేస్తున్నారు. భారీ స్థాయి తయారీని ప్రోత్సహించి, పోటీతత్వాన్ని పెంపొందిం చేందు కు ఎంఎంఎఫ్ ఫ్యాబ్రిక్, దుస్తులు, టెక్నికల్ టెక్స్ టైల్స్‌పై దృష్టి సారిస్తూ ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకాన్ని అమలు చేస్తున్నారు. పరిశోధన, ఆవిష్కరణ, అభివృద్ధి, ప్రోత్సాహం, మార్కెట్ అభివృద్ధిపై జాతీయ టెక్నికల్ టెక్స్ టైల్స్ మిషన్ దృష్టి సారిస్తోంది.

తెలంగాణ సారస్వత పరిషత్తు
హైదరాబాదు.
ఆహ్వానం
పరిణతవాణి
65 ఏళ్ళ ప్రాయం దాటిన ప్రఖ్యాత కవి పండితులు, ప్రముఖుల స్వీయసాహిత్య జీవిత విశేషాలను ఆవిష్కరింపజేసే ఉపన్యాస పరంపర
అధ్యక్షులు
ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

ప్రసంగకర్త
శ్రీ గుండు వల్లీశ్వర్ గారు
ప్రముఖ పాత్రికేయులు,
సాహితీవేత్త
సమావేశకర్త
డా. ఎ. సిల్మానాయక్
ప్రధానాచార్యులు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల
తేది : 2026 ఫిబ్రవరి 13, సాయంత్రం 5.30 గంటలకు
వేదిక : డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరం,
తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాదు
ఈ కార్యక్రమానికి తప్పక విచ్చేయవలసిందిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాం
డా. జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

# "భారత్ ట్యాక్సీ" సహకార రంగం బలోపేతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఉపాధి కల్పన, సామాజిక భద్రత, క్షేత్రస్థాయిలో ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించే సాధనాలుగా సహకార సంస్థలను బలోపేతం చేయడానికి సహకార మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. యాజమాన్యంలో, పాలనలో, విలువను సృష్టించడంలో కేంద్రంగా, సారథులుగా డ్రైవర్లను వ్యవహరిస్తూ రవాణా రంగంలో విప్లవాత్మక మార్పుగా భారత్ ట్యాక్సీని పరిగణిస్తున్నారు. తద్వారా అగ్రిగేటర్ల విధానానికి సుస్థిరమైన, గౌరవప్రదమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. భారత్‌లో సహకార ఆధారిత రైడ్ అందించే తొలి వేదిక "భారత్ ట్యాక్సీ". సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి, 'సహకార్ సే సమృద్ధి' అనే దార్శనికతకు అనుగుణంగా, సమగ్రమైన, పౌర కేంద్రీకృత రవాణా పరిష్కారాలను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిలో ఇదొక ప్రధాన మైలురాయి. బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టం-2002 కింద భారత్ టాక్సీ నమోదయింది. సహకార రంగంలో పనిచేస్తున్న 8 జాతీయ స్థాయి సంస్థల తోడ్పాటుతో 2025, జూన్ 6న ఇది ప్రారంభమైంది. సున్నా కమిషన్ నమూనాలో ఈ వేదిక పనిచేస్తుంది. దీనిలో వచ్చే లాభాలను నేరుగా డ్రైవర్లకే పంపిణీ చేస్తారు. ఇది పెట్టుబడి ఆధారిత అగ్రిగేటర్ ప్లాట్‌ఫారమ్‌లకు పూర్తి స్వదేశీ, ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.

ప్రస్తుతానికి భారత్ టాక్సీ సేవలు ఢిల్లీ ఎన్సీఆర్- ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడాలోనూ, గుజరాత్‌లోని అహ్మదాబాద్, రాజ్‌కోట్, సోమనాథ్, ద్వారకల్లో అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లో ఇప్పటివరకు 990,082 మంది వినియోగదారులు, 3 లక్షల కంటే ఎక్కువ మంది డ్రైవర్లు నమోదు చేసుకున్నారు. వీరు ఇప్పటివరకు 291,665 రైడ్‌లను పూర్తి చేశారు. దశలవారీగా 2029 నాటికి దేశవ్యాప్తంగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని భారత్ ట్యాక్సీ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతానికి, యాప్ ద్వారా ప్రయాణికులు లేదా డ్రైవర్ల నుంచి సేవా సౌలభ్య రుసుము, ప్లాట్‌ఫారమ్ ఫీజు లేదా కమిషన్ రూపంలో ఎటువంటి ఛార్జీలు వసూలు చేయడం లేదు. అయితే, భారత్ టాక్సీ నిర్వహిస్తున్న విమానాశ్రయ ప్రీపెయిడ్ బూత్‌ల వద్ద, నిర్వహణ ఖర్చుల కోసం ఛార్జీపై 7 శాతం సేవా రుసుము వర్తిస్తుంది.

ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పదవీ విరమణ పొదుపు, డ్రైవర్లకు తోడ్పాటు అందించే ప్రత్యేక వ్యవస్థ ద్వారా సారథుల సామాజిక భద్రతకు భారత్ టాక్సీ ప్రాధాన్యతనిస్తుంది. ఇది ఢిల్లీలోని ఏడు కీలక ప్రాంతాలలో సహాయ కేంద్రాలను నిర్వహిస్తోంది. అత్యవసర సమయాల్లో వేగవంతమైన సహాయాన్ని, ధృవీకరించిన రైడ్ సమాచారాన్ని అందిస్తుంది. డ్రైవర్లపై ఎలాంటి నియంత్రణలను విధించకుండా, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో కూడా పనిచేసే స్వేచ్ఛను కల్పిస్తుంది.

అంతేకాకుండా, 'బైక్ దీదీ' లాంటి కార్యక్రమాల ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే 150 మందికి పైగా మహిళా డ్రైవర్లు దీనిలో చేరారు.

భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, నగరాలకు సేవలను విస్తరించాలని, ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, డ్రైవర్ల సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయాలని భారత్ ట్యాక్సీ యోచిస్తోంది. అలాగే జాతీయ డిజిటల్ ప్రజా మౌలిక వసతులతో బలమైన అనుసంధానాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావిస్తోంది. తద్వారా సుస్థిరమైన, సమగ్రమైన, సహకార ఆధారిత రవాణా వ్యవస్థను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ సమాచారాన్ని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అందించారు.

# మాజీ సైనికులు (కేంద్ర సివిల్ సర్వీసులు, పోస్టుల్లో పునర్నియామకం) సవరణ నియమాలు 2026

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: రాజ్యాంగంలోని 309వ అధికరణ ప్రకారం మాజీ సైనికోద్యోగులు (కేంద్ర సివిల్ సర్వీసులు, పోస్టుల్లో పునర్నియామకం) సవరణ నిబంధనలు-2026ను ప్రభుత్వం ప్రకటించింది. ఆర్మీ, నౌకా దళం, వాయుసేనలో పోరాట లేదా పోరాటేతర విభాగాల్లో ఏ ర్యాంకులో పని చేసిన వారైనా కేంద్ర సివిల్ సర్వీసుల్లో పనిచేసేందుకు మాజీ సైనికులను పునర్నియామకం నిర్వచన పరిధిలోకి వచ్చేలా 2(సీ)(1) నియమాన్ని సవరించారు. అలాగే మిలటరీ నర్సింగ్ సేవలు (ఎంఎన్ఎస్) సిబ్బందిని కూడా దీని పరిధిలోకి తీసుకువచ్చారు.

కమిషన్డ్ ఆఫీసర్లుగా ఉన్న ఎంఎన్ఎస్ అధికారులకు ఇతర మాజీ సైనికుల మాదిరిగానే పునర్నియామక ప్రయోజనాలు లభిస్తాయా లేదా అనే విషయంలో గతంలో ఉన్న అస్పష్టతను ఈ సవరణ తొలగించింది. దీని ద్వారా పునర్నియామక నిబంధనల పరిధిలో ఎంఎన్ఎస్ సిబ్బందిని అధికారికంగా గుర్తించడమే కాకుండా, మాజీ రక్షణ సిబ్బందిలో మరింత ఎక్కువ మందికి పునరావాసం, ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలను బలోపేతం చేస్తుంది.

2వ నియమంలోని, క్లాజ్ (సి) సవరణ ప్రకారం, 'మాజీ సైనికుల' నిర్వచనంలో ఇప్పుడు ఆర్మీ, నౌకా దళం, వాయుసేనతో పాటు 'భారత యూనియన్ మిలిటరీ నర్సింగ్ సర్వీస్' (ఎంఎన్ఎస్)ను కూడా స్పష్టంగా చేర్చారు. పోరాట లేదా పోరాటేతర విభాగాల్లో ఏ ర్యాంకులో పని చేసిన వారికైనా ఈ నిబంధన వర్తిస్తుంది. ఈ సవరణ ఫిబ్రవరి 09, 2026న ప్రచురితమైన వెంటనే అమలులోకి వచ్చింది.

**ఎంఎన్ఎస్ సిబ్బందికి ఈ సవరణ అధికారికంగా కల్పించే ప్రయోజనాలు:**

రిజర్వేషన్ కోటాలు: కేంద్ర ప్రభుత్వ పోస్టుల్లో గ్రూప్ సిలో 10 శాతం, గ్రూప్ డీలో 20 శాతం.

వయో పరిమితి సడలింపు: సివిల్ ఉద్యోగ అర్హత కోసం అభ్యర్థి వాస్తవ వయసు నుంచి వారు మిలటరీ సర్వీసులో ఉన్న సంవత్సరాలతో పాటు.. అదనంగా మరో మూడేళ్లను తగ్గించుకొనేలా వెసులుబాటు.

# మరో కేసులో అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్

అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబును దూషించిన కేసులో అరెస్టై బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కు మరో కేసులో కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇప్పటికే రెండు కేసుల్లో బెయిల్ పొందిన అంబటికి గుంటూరు ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి కోర్టు గురువారం రిమాండ్ తీర్పునిచ్చారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో అక్రమాలు జరిగాయంటూ ఒకరు కేసు నమోదు చేయడంతో రాజమండ్రి జైలులో ఉన్న అంబటి రాంబాబును పీటీ వారెంట్‌పై గుంటూరుకు తీసుకు వచ్చారు. ఈ కేసును పరిశీలించిన న్యాయమూర్తి వాటిని పరిశీలించి 14 రోజుల పాటు రిమాండ్ తీర్పునివ్వడంతో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# నల్లగొండలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నల్గొండ, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలకు బదులుగా తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్ లను కేంద్రం వెంటనే రద్దు చేయాలని, అలాగే కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి ఎన్ఆర్సీ రాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ రెడ్డి, ఏఎల్ స్వామి, ఎస్‌డబ్ల్యూయూ రీజియన్ కార్యదర్శి యార చంద్రయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ అధ్యక్షుడు కందుల నర్సింహ, రీజియన్ సహాయ కార్యదర్శి కె.శ్యామ్ సుందర్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహయ్య, గులాం రసూల్ పాల్గొన్నారు.

# సౌదీ అరేబియాలోని రియాద్‌లో వరల్డ్ డిఫెన్స్ షో-2026.. దేశీయ రక్షణ పాటవాన్ని చాటిన భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: సౌదీ అరేబియాలోని రియాద్‌లో 2026 ఫిబ్రవరి 8వ, 9వ తేదీల్లో వరల్డ్ డిఫెన్స్ షో (డబ్ల్యూ డీ ఎస్)-2026ను నిర్వహించారు. కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేఠ్ నాయకత్వంలో భారత్‌కు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం ఈ కార్యక్రమంలో పాలుపంచుకొంది. డబ్ల్యూడీఎస్ ప్రారంభోత్సవంలో అంతర్జాతీయ ప్రముఖులతో పాటు శ్రీ సంజయ్ సేఠ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలిసారి ఏర్పాటు చేసిన భారత్ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ మండపంలో డిఫెన్స్ పబ్లిక్ సెక్టర్ అండర్ టేకింగ్స్ (డీపీఎస్‌యూల)తో పాటు భారత ప్రయివేటు కంపెనీల తయారీ సత్తాను చాటారు. సౌదీ అరేబియా దేశీయ సాంకేతిక పురోగతి విజయాలను సమీక్షించే ఉద్దేశంతో, సౌదీ అరేబియా మిలటరీ ఇండస్ట్రీస్ (ఎస్ఏఎమ్ఐ), సౌదీ అరేబియా రక్షణ శాఖలు కొలువుదీర్చిన ప్రదర్శనలను రక్షణ శాఖ సహాయ మంత్రి సందర్శించారు.

ఇరు దేశాల సాయుధ దళాల మధ్య సహకారాన్నీ, సమన్వయాన్నీ పెంపొందింప చేసుకోవడానికి సంబంధించి సౌదీ అరేబియా డిఫెన్స్ ఫర్ ఎగ్జిక్యూటివ్ అఫైర్స్ అసిస్టెంట్ మినిస్టర్ డాక్టర్ ఖాలిద్ బిన్ హుసేన్ అల్-బియానీతో శ్రీ సంజయ్ సేఠ్ చర్చించారు.

సౌదీ అరేబియా డిఫెన్స్ డెవలప్‌మెంట్ జనరల్ అథారిటీ (జీఏడీడీ) గవర్నరు డాక్టర్ ఫలేహ్ బిన్ అబ్దుల్లా అల్-సులేమాన్‌తో కూడా శ్రీ సేఠ్ సమావేశమయ్యారు. భారత్ ప్రపంచ ఎగుమతుల కూడలిగా ఎదుగుతున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. రక్షణ సాంకేతికతలను అభివృద్ధి పరిచేందుకు గల అవకాశాలను కలిసికట్టుగా పరిశీలించడానికి భారత పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కేంద్రాలను సందర్శించడానికి జీఏడీడీ అధికారులు రావాల్సిందిగా రక్షణ శాఖ సహాయ మంత్రి ఆహ్వానించారు.

సౌదీ అరేబియా మిలటరీ ఇండస్ట్రీస్ జనరల్ అథారిటీ (జీఏఎమ్ఐ) గవర్నరు శ్రీ అహ్మద్ బిన్ అబ్దులజీజ్ అల్-ఒహాలీతోనూ శ్రీ సంజయ్ సేఠ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక సహకారానికి తగిన ఉమ్మడి రంగాల గురించీ, ఉభయ దేశాల సరఫరా వ్యవస్థ తాలూకు అనుబంధ విస్తారిత వ్యవస్థను బలోపేతం చేయడాన్ని గురించీ చర్చించారు. భారత రక్షణ రంగ సామర్థ్యాలపై స్వయంగా అవగాహన ఏర్పరుచుకోవడానికి జీఏఎమ్ఐ నాయకత్వంలో ఓ సంయుక్త ప్రతినిధి వర్గం ఇండియాను సందర్శించాలని రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రతిపాదించారు.

భారతీయ, సౌదీ రక్షణ రంగ కంపెనీల ప్రధాన అధికారులతో భారతీయ దౌత్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రక్షణ శాఖ సహాయ మంత్రి ప్రసంగించారు. రక్షణ రంగంలో స్వావలంబనను సాధించడానికి భారత్, సౌదీ అరేబియాల మధ్య సంయుక్త సహకారానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఆయన స్పష్టం చేశారు. "భారత్ లో తయారీ, ప్రపంచం కోసం తయారీ" ("మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్'') దృష్టికోణంలో భాగంగా ప్రపంచానికి సహాయపడడానికి భారత్ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

సౌదీ పురుటిగడ్డ 'దిరియా హ్'ను కూడా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సందర్శించారు. ఈ ప్రాంతానికి యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు లభించింది. భారత రాయబారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో మంత్రి సౌదీలో స్థిరపడిన భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలకు సాధికారత కల్పన, ఆరోగ్యం, డిజిటల్ సాధనాల వినియోగం సహా వివిధ రంగాలలో భారత్ సాధించిన అభివృద్ధిని మంత్రి వివరించారు.

'దేశానికే ప్రాధాన్యం' దార్శనికతను రక్షణ శాఖ సహాయ మంత్రి సమర్థించారు. సౌదీ అరేబియాలో ఉంటున్న భారతీయులకు అందిస్తున్న సహాయ సహకారాలకు గాను దౌత్య కార్యాలయ అధికారులను మంత్రి ప్రశంసించారు.

# కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలి : జెర్రిపోతుల ధనుంజయ




నల్గొండ, ఫిబ్రవరి 12: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు నల్లగొండ జిల్లా నాయకుడు జెర్రిపోతుల ధనుంజయ అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలో కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు సిఐటియు చండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు వేగంగా అమలు చేస్తుందన్నారు. ప్రధానంగా కేంద్రం తెచ్చిన నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని, పాత చట్టాలను పునరుద్ధరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆశ, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కార్మికుల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని కోరారు. రైతాంగం, కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాడుతుంటే ఇవేమీ పట్టించుకోకుండా కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడాన్ని ఆయన దుయ్యబట్టారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్ లు అమలు జరిగితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాల కోసం బేరసారాల హక్కు కోల్పోతారని, పని గంటలు విపరీతంగా పెరుగుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, మొగుదాల వెంకటేశం, మున్సిపల్ యూనియన్ నాయకులు కత్తుల సైదులు, నల్లగంటి లింగస్వామి, బీపంగి నాగరాజు, ఇర్గి యాదయ్య, కళమ్మ, రేణుక, ముత్తమ్మ, అలివేలు, తెలంగాణ గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి శంకర్, రేవల్లి సైదులు, యూనియన్ నాయకులు నాగిళ్ల లక్ష్మణ్, అన్నేపాక నరసింహ, మల్లయ్య, పుష్పలత, వెంకటాచారి, నగేష్, వెంకులు, బేర భిక్షమయ్య, లక్ష్మయ్య, మహేందర్, హమాలి యూనియన్ నాయకులు సాయం కృష్ణయ్య, నాగరాజు, యాదయ్య, వెంకన్న, పాశం శేఖర్, బొమ్మర గోని శ్రీను, కట్ట గణేష్, కావలి వెంకన్న, నాగేష్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కట్ట పద్మ, యూనియన్ నాయకులు నాగమణి, పరమేశ్వరి, వరలక్ష్మి, జయమ్మ, పి.నాగమణి, రాధా, వేదవతి, సుమలత, కారింగు జ్యోతి, రోజా పాల్గొన్నారు.

# మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ బి.చంద్రశేఖర్



నల్లగొండ, ఫిబ్రవరి 12 : మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు, ఇతర మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి వద్ద ఉన్న స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని, నాగార్జునసాగర్ రోడ్‌లోని శ్రీ రామానంద తీర్థ ఇనిస్టిట్యూట్ సమీపంలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మిర్యాలగూడకు సంబంధించి అవంతీపురం మార్కెట్ యార్డులో, నందికొండ, హాలియా మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపు నల్లగొండ సమీపంలోని నిడమనూరు తెలంగాణ సోషల్ వెల్‌ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో, దేవరకొండ, చండూరు, చిట్యాల మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపడుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా ప్రతి వార్డుకు ఒక కౌంటింగ్ టేబుల్ ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం

ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ అసిస్టెంట్, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఆర్‌ఓలు ఉంటారన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించిన తర్వాత రెగ్యులర్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఎక్కువ వార్డులు ఉన్నచోట పోలింగ్ కేంద్రాలను బట్టి రౌండ్స్ లెక్కించడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ 13న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు, ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించడం జరగదని, ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి ఉన్నారు.

# ఆర్థిక అక్షరాస్యత పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలి : కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జారాం




మెదక్, జనవరి 12:ప్రతి ఒక్కరికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండడం ఎంతో ముఖ్యమని న్యాల్కల్ మండలంలోని హద్నూర్ కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జారాం సూచించారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనం కష్టపడి సంపాదించిన వాటికి విలువ, గుర్తింపు ఆర్థిక అక్షరాస్యతతోనే సాధ్యమని పేర్కొన్నారు. భవిష్యత్ ప్రణాళిక లను ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

నానాటికి పెరిగిపోతున్న సైబర్ నేరాలు, మోసాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల పథకాలు, రుణాలు, బీమా సదుపాయాలను వివరించారు. యువత, మహిళలు, రైతులు తక్కువ వడ్డీతో అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా లభించే జన సురక్ష, పీఎం విశ్వకర్మ యోజన, ముద్ర, పీఎంఈజీపీ , పీఎం జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన లాంటి రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవన విధానంలో పొదుపు అనేది ఎంతో ముఖ్యమైందని.. పొదుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ షబ్బీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి ధనరాజ్, బ్యాంకు అధికారులు ప్రశాంత్, వార్డు సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉండేటి ప్రసాద్‌కు బీఆర్ఎస్ నాయకుల నివాళి

ఖమ్మం, ఫిబ్రవరి 12: : టేకులపల్లి మండలం సులానగర్ గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ విగ్రహావిష్కరణలో బీఆర్ఎస్ టేకులపల్లి మండల నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ కుమారుడు ఉండేటి చెన్నయ్య, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రసాద్ రాజకీయాలలో అందరికి సుపరిచితుడుగా ఉండేవారన్నారు. గర్వం లేని మంచి వ్యక్తి అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్, మాజీ జెడ్పిటిసి లక్కినేని సురేందర్రావు, జిల్లా నాయకులు భూక్య దళ్సింగ్ నాయక్, టేకులపల్లి సర్పంచ్ బోడా బాలు నాయక్, సులానగర్ సర్పంచ్ గుగులోత్ లక్ష్మా, చుక్కలబోడు సర్పంచ్ బానోత్ రామానాయక్, బీఆర్ఎస్ మండల నాయకులు కిరణ్, బాలకృష్ణ, పూల్సింగ్, రమేష్, రాంకుమార్ పాల్గొన్నారు.

# కౌశల్ రథ్ ప్రారంభం.. " యువ ఏఐ ఫర్ ఆల్" కార్యక్రమం ద్వారా

## ఏఐ వినియోగాన్ని భారతదేశం మొత్తానికీ చేర్చడం దీని లక్ష్యం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: అఖిల భారత ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సాంకేతికత (ఏఐఎస్ఈసీటీ) సహకారంతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖ (ఎంఈఐటీవై) పరిధిలోని 'ఇండియాఏఐ' (ఎనిటతి జీంఎ) కౌశల్ రథ్‌ను ఈ రోజు ప్రారంభించింది. ఇది జాతీయ ఏఐ వినియోగ కార్యక్రమం "యువ ఏఐ ఫర్ ఆల్"లో భాగంగా అమలుచేస్తున్న సంచార కృత్రిమ మేధస్సు (ఏఐ) చైతన్య కార్యక్రమం. సెమీ-అర్బన్ ప్రాంతాల, ఆదరణకు నోచుకోని ప్రాంతాల విద్యార్థులు, యువత, గురువులు, శిక్షణార్థుల చెంతకు చేరుకొని మౌలిక ఏఐ శిక్షణను ఇవ్వడమే కాకుండా, డిజిటల్ సేవల అలభ్యతను తగ్గించడం కూడా ఈ కార్యక్రమం లక్ష్యాలే.

కౌశల్ రథ్‌లో పూర్తి స్థాయి సంచార కంప్యూటర్ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. దీనిలో ఇంటర్‌నెట్ సాయంతో పనిచేసే వ్యవస్థలు, దృశ్య, శ్రవణ పరికరాలు, తీర్చిదిద్దిన శిక్షణ పద్ధతులు భాగంగా ఉన్నాయి. ఇది పాంశాలలకీ, కళాశాలలకీ, ఐటీఐలతో పాటు సాముదాయిక కేంద్రాలకీ చేరుకొని సుశిక్షణ పొందిన వారి సహాయంతో భారత్ అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధనీ, జనరేటివ్ ఏఐ సేవల్నీ ఎలా ఉపయోగించుకోవచ్చో తెలియజెబుతుంది.

కేంద్ర వాణిజ్య, పరిశ్రమ శాఖ సహాయ మంత్రి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికత శాఖ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం విస్తృతమైన డిజిటల్ సామర్థ్యాల్ని నిర్మించడంతో పాటు బాధ్యత కలిగి ఉండే సాంకేతికతను అనుసరించడం ద్వారా ఏఐ-సన్నద్ధ భాంత్‌ను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఎంతటి నిబద్ధతతో ఉందో చాటిచెబుతోంది.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద మాట్లాడుతూ " 'యువ ఏఐ ఫర్ ఆల్' కార్యక్రమాన్నీ, కౌశల్ రథ్‌నీ ప్రవేశపెట్టి మేం కృత్రిమ మేధ పట్ల చైతన్యాన్ని నేరుగా పూర్తి దేశానికి, ప్రత్యేకించి యువతకు అందజేస్తున్నాం. ఈ బస్సు వివిధ ప్రాంతాలకు వెళ్లి విద్యార్థులకీ, యువతీయువకులకీ కృత్రిమ మేధను ఉపయోగించడమెలా, కృత్రిమ మేధ ప్రయోజనాలు అందుకోవడమెలా అనే అంశాలపై శిక్షణను ఇవ్వడంతో పాటు, 'చైతన్యం, అవకాశాల లభ్యతలు.. భౌగోళిక పరిమితులకూ, జనసంఖ్య సంబంధిత పరిమితులకూ అతీతంగా ఉండాలి' అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చెప్పిన మాటలను కూడా సాకారం చేస్తుంది. వచ్చే వారంలో న్యూఢిల్లీలో జరగనున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026కు ముందుగా చేపట్టిన సన్నాహక కార్యక్రమాలే ఈ 'యువా ఏఐ ఫర్ ఆల్', 'కౌశల్ రథ్'. అభివ?ద్ధి చెందుతున్న దేశాలలో తొలిసారి ఏర్పాటు చేస్తున్న ఈ శిఖరాగ్ర సదస్సుకు మొదటిసారి ఆతిథ్యాన్ని ఇస్తుండడం భారత్‌కెంతో గర్వకారణం" అన్నారు.

కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఇండియాఏఐ మిషన్ సీఓఓ, ఎంఈఐటీవైకి చెందిన జి సైంటిస్ట శ్రీమతి కవితా భాటియా మాట్లాడుతూ, "ఇండియాఏఐ మిషన్లో భాగంగా, నైపుణ్యాలను అందించడం ఏడు కీలకమైన అంశాల్లో ఒక అంశంగా ఉంది. అంతేకాదు, ఈ కార్యక్రమం విస్తృత స్థాయిలో ఏఐ విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకుపోవాలన్న మన లక్ష్యాన్ని కూడా ముందుకు తీసుకుపోతోంది. కౌశల్ రథ్ ద్వారా, మనం ఏకీకృత ప్రణాళికలు, ఏఐ ఉపకరణాలు, ముందుగా సిద్ధం చేసిన పాఠ్యక్రమాలను ఉపయోగించి వేర్వేరు సంస్థల విద్యార్థులకు ఏఐ బోధనావకాశాన్ని కల్పిస్తున్నాం. దీన్లో ఏఐ పట్ల ఉన్న అపోహల్ని తొలగించడానికి ఉద్దేశించిన 'యువ్ఏఐ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని కూడా చేర్చాం. బోధకుల నాయకత్వంలో శిక్షణ ప్రక్రియ, మైక్రో, నానో ప్రమాణ పత్రాలతో పాటు దేశవ్యాప్త లభ్యతను కూడా కలబోయడం ద్వారా అన్ని ప్రాంతాల శిక్షణార్థులకీ ఏఐ నైపుణ్యాలు అందుబాటులోకి వచ్చే టట్లు చర్యలు తీసుకుం టున్నాం" అని వివరించారు.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 2026 ఫిబ్రవరి 16 నుంచి 20 వ తేదీల మధ్య 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'ను నిర్వహించే కన్నా ముందు.. జాతీయ స్థాయిలో చైతన్యాన్ని కలిగించే, సామర్థ్యాల్ని పెంపొందించే దిశగా చేపట్టిన ప్రయత్నాల్లో కౌశల్ రథ్ విశేషమైన తోడ్పాటును అందించనుంది.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మొదటి సారి ఏర్పాటు చేస్తున్న ప్రపంచ స్థాయి ఏఐ శిఖరాగ్ర సదస్సుగా చెబుతున్న ఈ కార్యక్రమంలో, "ప్రజలు, పృథ్వి, ప్రగతి".. ఈ మూడూ ముఖ్యాంశాలు కాబోతున్నాయి. దీంతో పాటే, భారతదేశ జాతీయ ప్రాధాన్యాలకు అనుగుణంగా.. ప్రపంచ ఏఐ సంబంధిత చర్చోపచర్చలను అభివృద్ధికి పెద్దపీట వేసే ఫలితాలుగా మార్చడంపైనా ఈ శిఖరాగ్ర సదస్సులో దృష్టిని కేంద్రీకరిస్తారు.

# తిరుమల లడ్డూ కల్తీపై సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు



తిరుపతి, ఫిబ్రవరి 12: దేశవ్యాప్తంగా తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం సంచలనం కలిగిస్తున్న వేళ సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ గురువారం తిరుమలను సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడి జరిగిన విషయాలను ఆయన మీడియాతో పంచుకున్నారు.

తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందనేది వాస్తవమే అయినప్పటికీ, రాజకీయ నాయకులు ఈ అంశంపై రాజకీయం చేయడం మానేసి, దానికి సంబంధించిన దోషులకు కఠినమైన శిక్ష విధించాలని సూచించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు లడ్డూ సమస్యను రాజకీయ లాభం కోసం ఉపయోగించుకుంటూ భక్తులకు మానసిక వేదన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

ఇరు పార్టీల నాయకులు నోరును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. బాధ్యతా యుతమైన అధికారులు , మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పై చర్య తీసుకోవాలని, దానిని రాజకీయ వైరంగా మార్చవద్దని తెలిపారు. పవిత్రమైన లడ్డూలను తయారు చేయడానికి ఉపయోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని పేర్కొన్నారు.

# ఆదర్శ ఫౌండేషన్‌కు శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ విరాళం



హైదరాబాద్, ఫిబ్రవరి 12: అమీర్‌పేటలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్‌లో ఇటీవల ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన నిధులను ఆదర్శ ఫౌండేషన్‌కు విరాళంగా అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులంతా కలిసి ఆదర్శ ఫౌండేషన్‌కు వెళ్లి అక్కడి చిన్నారులకు సామాగ్రి, భోజనాన్ని పంపిణీ చేశారు. స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు చాలా ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని మానవత్వం, సేవా భావం ఎంత ముఖ్యమో చాటి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని స్కూల్ మేనేజ్ మెంట్ తెలిపింది.

# తెలంగాణలో పీఎంఎంఎస్‌వై పథకం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారత ప్రభుత్వ (జీఓఐ) మత్స్య విభాగం (డీఓఎఫ్), మత్స్య మంత్రిత్వ శాఖ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ (ఎంఓఎఫ్ఏహెచ్‌డీ) 2020-21 నుంచి తెలంగాణ సహా అన్ని రాష్ట్రాలు, యూటీల్లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకాన్ని అమలు చేస్తోంది. పీఎంఎంఎస్‌వై ద్వారా రాష్ట్రంలో మత్స్య సంపద, ఆక్వా కల్చర్ అభివృద్ధికి మౌలిక సదుపాయాలతో సహా మొత్తం రూ.196.80 కోట్ల విలువైన ప్రతిపాదనలకు డీఓఎఫ్, జీఓఐ ఆమోదం తెలపగా, అందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.68.14 కోట్లు. గత మూడేళ్లలో పీఎంఎంఎస్‌వై ద్వారా తెలంగాణకు విడుదలైన నిధుల వివరాలను అనుబంధం-ఎలో, ఈ పథకం ద్వారా తెలంగాణలో చేపట్టిన మత్స్య మౌలిక సదుపాయాల వివరాలను అనుబంధం-ఎవిలో పొందుపరిచారు.

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 4,54,432 మంది లబ్ధిదారులను పీఎంఎంఎస్‌వైలో చేర్చినట్లు తెలంగాణ ప్రభుత్వం నివేదించింది.

పీఎంఎంఎస్‌వై ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచటం, పెట్టుబడి ఖర్చును తగ్గించటం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వానికి అనేక కార్యకలాపాలను డీఓఎఫ్, జీఓఐ ఆమోదించింది. వాటిలో ఇవి ఉన్నాయి: (ఎ) 21 నూతన మంచినీటి చేపల విత్తనోత్పత్తి కేంద్రాల ఏర్పాటు (బి) పెట్టుబడి సాయంతో 824 హెక్టార్ల విస్తీర్ణంలో గ్రో-అవుట్ పాండ్స్ అభివృద్ధి 1.4 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలోని జలాశయాల్లో చేప పిల్లలను నిల్వ చేయటం 11 పునర్వినియోగ నీటి ఆధారిత చేపల పెంపకం యూనిట్ల ఏర్పాటు జలాశయాల్లో 89 కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటు.

మార్కెట్ అనుసంధానతను బలోపేతం చేయటానికి తెలంగాణ ప్రభుత్వానికి డీఓఎఫ్, జీఓఐ ఆమోదించిన వివిధ కార్యకలాపాల్లో భాగంగా ఇవి ఉన్నాయి: హైదరాబాద్‌లో అత్యాధునిక హోల్‌సేల్ చేపల మార్కెట్ ఏర్పాటు 185 చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటు 2 సజీవ చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటు 6 ఇన్సులేటెడ్ వాహనాల సరఫరా ఐస్ బాక్సులతో ఉన్న 500 మోటార్ సైకిళ్ల పంపిణీ.

కొర్రమీను ఉత్పత్తిని పెంచటానికి, ఉత్పాదకతను మెరుగుపరచటానికి, మార్కెట్ అనుసంధానాన్ని బలోపేతం చేయటానికి తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ప్రత్యేక కొర్రమీను ఉత్పత్తి, ప్రాసెసింగ్ క్లస్టర్‌ను డీఓఎఫ్, జీఓఐ అధికారికంగా ప్రకటించింది.

# డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే బాలకృష్ణ భేటీ

అమరావతి, ఫిబ్రవరి 12: జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కలిశారు. పలు అంశాలపై పవన్ తో బాలకృష్ణ చర్చించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హిందూపురం నియోజకవర్గానికి సంబంధించిన విషయాలు, రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై వీరిద్దరూ మాట్లాడుకున్నట్లు సమాచారం

# నూతన చట్టాలను రద్దు చేయాలని ర్యాలీ..




ఉరవకొండ ఫిబ్రవరి 12: దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈరోజు ఉరవకొండ పట్టణంలో సిఐటియు, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమైఖ్య ఈ సమ్మెకు మద్దతు ప్రకటించి అనుబంధ సంఘాలన్నీ సంఘీభావం తెలిపాయి.

కరిబసప్ప స్వామి గవి మఠం వద్ద నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీఎన్జీ వోస్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలి, వేతన సవరణ, పిఎఫ్ ఆర్డిఏ చట్టం రద్దు, పెండింగ్ బకాయిలు చెల్లింపు, కాంట్రాక్ట్ ఉద్యోగుల నియమితీకరణ, పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ అమలు చేయాలన్నారు.

అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మధుసూదన్ నాయుడు, రంగారెడ్డి, సీనప్ప, ఉద్యోగ సంఘం నాయకులు భాస్కర్ బాబు, గురు ప్రసాద్, ధన శేఖర్, అరుణమ్మ, ప్రసాద్, అశ్వత్వ నారాయణ, పర్తప్ప, విజయ్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ సహకార బ్యాంకులకు సాంకేతిక సేవలందించేందుకు ఉమ్మడి సేవా సంస్థగా 'సహకార్ సారథి' ఏర్పాటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: భారత ప్రభుత్వాన్ని సంప్రదించిన అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జనవరి 19, 2026 నుంచి సహకార సంఘాలకు తిరిగి అప్పులు ఇవ్వటం కోసం ఎన్‌సీడీసీకి బ్యాంకులు మంజూరు చేసే రుణాలను, సంబంధిత విభాగాల ద్వారా ప్రాధాన్యతా రంగ రుణాలుగా పరిగణించేందుకు అర్హత ఉంటుంది.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, పట్టణ సహకార బ్యాంకులు, చిన్న ఫైనాన్స్ బ్యాంకులు, స్థానిక ప్రాంత బ్యాంకులకు మినహా మిగిలిన బ్యాంకులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఈ రుణాలు ప్రాధాన్యతా రంగ రుణాల మాస్టర్ డైరెక్షన్-2025లో పేర్కొన్న లక్ష్యాలు, కార్యకలాపాలకు ఉద్దేశించినవి.

సహకార మంత్రిత్వ శాఖ పరిపాలన నియంత్రణలోని చట్టబద్ధమైన సంస్థ అయిన జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ), సహకార సంఘాలకు ఆర్థిక సహాయాన్ని అందించటమే కాక, సహకార ఉద్యమ వృద్ధిని వేగవంతం చేయటంలో సహకరిస్తుంది.

సహకార బ్యాంకుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచటానికి, పాలనను బలోపేతం చేయటానికి, డిజిటల్ పరిజ్ఞానాన్ని పెంపొందించటానికి భారత ప్రభుత్వం, ఆర్బీఐ కలిసి పలు చర్యలు చేపట్టాయి. డిపాజిట్ల భద్రతను పెంచటం, రుణ సదుపాయాలను మెరుగుపరచటం, విశ్వసనీయంగా నిబంధనలను అమలు చేయటం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. వాటిలో కొన్ని:

పట్టణ సహకార బ్యాంకులకు సమాచార సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలు, కార్యాచరణ మద్దతును అందించటానికి సమన్వయ సంస్థగా నేషనల్ అర్బన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌యూసీఎఫ్‌డీసీ) సంస్థ, డిపాజిట్లను స్వీకరించని నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)గా ఏర్పాటు

అన్ని సహకార బ్యాంకుల్లోని ప్రతి డిపాజిటరుకు గరిష్ఠంగా రూ.5,00,000 వరకు (అసలు, వడ్డీ కలిపి) భీమా సౌకర్యాన్ని కల్పిస్తున్న డిపాజిట్ ఇన్సూరెన్స్, క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ)ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయమంత్రి శ్రీ పంకజ్ చౌదరి ఇవాళ రాజ్యసభలో ఈ సమాచారాన్ని అందించారు.

# విద్యార్థుల సమస్యలపై సమీక్షించే తీరిక లేకపోవడం సిగ్గుచేటు : హరీశ్ రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో ప్రతిరోజూ ఏదో ఒక పాఠశాలలో భోజనంలో కల్తీ జరిగి అస్వస్థతపాలవుతున్న విద్యార్థులపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించే తీరికలేకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు ఆరోపించారు.సంగారెడ్డి జిల్లా నారాయణ్ ఖేడ్ మండలం ఎస్టీ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కల్తీ ఆహారం మాకొద్దు అంటూ రోడ్డెక్కిన విషయం, హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న ఉస్మానియా యూనివర్సిటీలో భోజనం బాగుండటం లేదని విద్యార్థుల నిరసనలపై ట్వీట్ ద్వారా ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం గాలి మోటార్లలో చక్కర్లు కొట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గురుకులాల్లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులపై సమీక్షించే తీరిక లేకపోవడం విచారకరమన్నారు.ఉస్మానియాకు వెళ్లి రిబ్బన్లు కట్ చేయడం తప్ప రెండున్న రేండ్లుగా చేసిన అభివృద్ధి ఏముంది అని ప్రశ్నించారు. మాటలు కోటలు దాటితే ఆచరణ గడప దాటది అనడానికి ముఖ్యమంత్రి పర్ఫెక్ట్ ఉదాహరణ అని ఎద్దేవ చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసమే అంటూ ఇప్పటి వరకు 62 సార్లు ఢిల్లీకి వెళ్లిన రేవంత్ రెడ్డి సాధించిదేమిటో మొన్నటి కేంద్ర బడ్జెట్ తోనే తేటతెల్లమైందని విమర్శించారు.

ఒకవైపు గురుకులాల ఖ్యాతిని మసకబార్చిన రేవంత్ రెడ్డి, మరో వైపు అంచనాలు పెంచి కమీషన్లు దండుకోవడానికే యంగ్ ఇండియా స్కూల్స్ పేరిట భారీ నాటకానికి తెరతీసిండని ఆరోపించారు.కూట్లో రాయి తీయలేనోడు, ఏట్లో రాయి తీస్తడట అన్నట్లు ఉన్న గురుకులాల్లో పిల్లలకు మంచి భోజనం పెట్టలేని ప్రభుత్వం, అంతర్జాతీయ స్థాయి



వసతులు కల్పిస్తారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

పురుగుల్లేని అన్నం కోసం విద్యార్థులు నడిరోడ్డెక్కి నిరసన తెలియచేయాల్సిన దుస్థితి కల్పించడమేనా ఇందిరమ్మ రాజ్యం?ఉస్మానియా విద్యార్థులు, తల్లిదండ్రులకు కనీస గౌరవం కూడా ఇవ్వకుండా అవమానించడమేనా మీ ప్రజాపాలన?రేవంత్ రెడ్డి పరిపాలన అంటే ప్రగల్భాలు పలకడం కాదు. ప్రతిపక్షాలపై బూతుల వర్షం కురిపించడం అంతకంటే కాదు.హార్వార్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి వచ్చినా కూడా.. మీరు విద్య పట్ల, విద్యార్థుల పట్ల ప్రాధాన్యం చూపకపోవడం శోచనీయం.ఇప్పటికైనా విద్యాశాఖ మీద దృష్టి సారించి, గురుకుల విద్యార్థులకు పురుగుల్లేని భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

# ఈ 14 నుండి తీర్థాల సంగమేశ్వర స్వామి జాతర

### అర్ధరాత్రి సంగమేశ్వర స్వామికి తొలి పూజ

### -వివిధ జిల్లాల నుండి లక్షలాది భక్తులు వచ్చే అవకాశం

### -ఏర్పాట్లు పూర్తి చేసిన రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 12 : ఖమ్మం జిల్లాలోనే సుప్రసిద్ధ శివాలయం అయిన తీర్థాల సంగమేశ్వర స్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు కొనసాగుతాయని దేవాలయం ఈఓ వేణుగోపాలాచారి తెలిపారు. ఇప్పటికే ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు అధ్యక్షతన వైద్య ఆరోగ్య, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ, మత్స్యశాఖ, మహిళా సంక్షేమ శాఖ తదితర అధికారులతో రెండు దఫాలుగా సమీక్ష జరిగిందన్నారు. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హైదరాబాద్ తో పాటు ఆంధ్రప్రదేశ్ నుండి సైతం వేలాది మంది భక్తులు మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తీర్థాలకు వచ్చే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఇప్పటికే ఖమ్మం రూరల్ తాసీల్దార్ నిరంతరం దేవాలయ ఈఓ తో కలిసి పర్యవేక్షణ చేస్తున్నారు.



ట్రాఫిక్ ఇతర సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు గాను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ ముష్కారాజ్ రూట్ మ్యాప్ లను తయారుచేసి సిబ్బందికి అవగాహన కల్పించారు. భక్తులకు అవసరమైన స్నాన ఘట్టాలు, నీటి ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచినట్లు దేవాలయం సిబ్బంది తెలిపారు. 14వ తేదీ అర్ధరాత్రి తొలి పూజ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు స్వామివారి కల్యాణం మహోత్సవ ఘట్టం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

# దేశంలో నర్సింగ్ సిబ్బంది అవసరాన్ని తీర్చడానికి 806 ప్రభుత్వ సంస్థలు సహా మొత్తం

## 5310 నర్సింగ్ సంస్థల్లో ఏటా సుమారు 3.82 లక్షల మందికి పూర్తి అవుతున్న శిక్షణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఇండియా హెల్త్ డైనమిక్స్ (హెచ్‌డీఐ) (మౌలిక సదుపాయాలు, మానవ వనరులు), 2022-23 ఏడాదికి ఒక సారి వెలువడే ప్రచురణ. దీనిని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ఇచ్చే ఆరోగ్య సంరక్షణ రంగ పరిపాలన సంబంధిత సమాచారం ఆధారంగా రూపొందిస్తున్నారు. ప్రజారోగ్య కేంద్రాల్లో డాక్టరు, నర్సు, స్పెషలిస్టు లభ్యత నిష్పత్తుల వివరాలను హెచ్‌డీఐ 2022-23 లో ఇచ్చిన ఈ కింది లింకులో చూడవచ్చును.

దేశంలో నమోదైన ఇంగ్లిషు వైద్యులు 13,88,185 మంది, ఆయుష్ చికిత్సకులు 7,51,768 మంది ఉన్నారు. అలోపతి, ఆయుష్ .. ఈ రెండు వ్యవస్థల్లోనూ నమోదైన చికిత్సకుల్లో 80 శాతం అందుబాటులో ఉన్నారనుకొంటే.. అప్పుడు డాక్టరు, జనసంఖ్య నిష్పత్తి 1:811గా ఉండవచ్చు; అంటే ప్రతి 811 మందికి ఒక డాక్టరు చొప్పున అందుబాటులో ఉన్నారని అర్థం చేసుకోవచ్చు. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నిర్దేశించిన ప్రమాణం అయిన 1:1000 (ప్రతి వేయి మందికి ఒక డాక్టరు) నిష్పత్తి కన్నా మెరుగ్గా ఉంది. భారతీయ నర్సింగ్ మండలి (ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్..ఐఎన్‌సీ) అందించిన సమాచారం మేరకు, దేశంలో 39.40 లక్షల మంది నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వారిలో 80 శాతం మంది క్రియాశీలురుగా ఉన్నారనుకున్నా, అప్పుడు ప్రతి 1,000 మంది జన సంఖ్యకూ 2.23 నర్సులు ఉన్నట్లు లెక్క తేలుతుంది. దేశంలో నర్సింగ్ సిబ్బంది అవసరాలు తీర్చడానికి 806 ప్రభుత్వ సంస్థలలో సహా మొత్తం 5310 నర్సింగ్ సంస్థలు ఒక్కో సంవత్సరానికీ సుమారు 3.82 లక్షల మంది నర్సింగ్ సిబ్బందిని తీర్చిదిద్దుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం సహా ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠపరచడం ఆయా రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల ప్రాథమిక బాధ్యత. జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్..ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా కార్యక్రమాల అమలు ప్రణాళిక (పీఐపీ)ల రూపంలో అందుకున్న ప్రతిపాదనల ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను పటిష్ఠపరచడానికి రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అందిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నియమాలు, అందుబాటులో ఉన్న నిధులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రతిపాదనలకు రికార్డ్ ఆఫ్ ప్రొసీడింగ్స్ (ఆర్‌ఓపీ)ల రూపంలో ఆమోదాన్ని తెలియజేస్తుంది. దీర్ఘకాలానికి భారతీయ ప్రజారోగ్య ప్రమాణాల (ఐపీహెచ్‌ఎస్) ప్రకారం, తగినంత సంఖ్యలో నియమిత (రెగ్యులర్) పోస్టులను కల్పిస్తూ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మానవ వనరులు లభ్యమయ్యేటట్లు చూడాల్సి ఉంటుంది. స్వల్ప కాలానికీ, మధ్య కాలానికీ కీలక లోటులను భర్తీ చేయడం కోసం ఎన్‌హెచ్‌ఎం పదవులను ఉపయోగించుకొంటారు. రెండో స్థాయి, ప్రాథమిక స్థాయి ఆరోగ్య సంరక్షణ కేంద్రాల (జిల్లా ఆసుపత్రి, అంతకన్నా కింది స్థాయి)లో మానవ వనరుల లోటును ఐపీహెచ్‌ఎస్ ప్రకారం ఎన్‌హెచ్‌ఎమ్ భర్తీ చేసి, రెగ్యులర్ మానవ వనరులను సమకూరుస్తుంది.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ జాదవ్ రాజ్యసభలో ఈ రోజు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ సమాచారాన్ని తెలియజేశారు.

## భువనేశ్వర్ రాజధాని ప్రాంత రింగు రోడ్డు నిర్మాణానికి బిడ్డర్ల నుంచి ఎన్‌హెచ్‌ఏఐకు అపూర్వ స్పందన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఒడిశాలో 111 కి.మీ. పొడవైన ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ క్యాపిటల్ రీజియన్ రింగు రోడ్డు (భువనేశ్వర్ బైపాస్) ప్రాజెక్టు నిర్మాణానికి బిడ్డర్ల నుంచి ఎన్‌హెచ్‌ఏఐకి అపూర్వ స్పందన లభించింది. మూడు ప్యాకేజీలుగా చేపట్టే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించింది. అన్ని ప్యాకేజీలకు బిడ్డర్ల నుంచి ప్రోత్సాహకరమైన స్పందన లభించింది. ఈ ప్రాజెక్టులోని ప్యాకేజీ-ఎకు 23, ప్యాకేజీ- కు 25, ప్యాకేజీ- ॥కు 16 బిడ్లు వచ్చాయి. అన్ని ప్యాకేజీలకు ఉన్న పోటీని, వీటిపై టెండరుదారులకున్న ఆసక్తిని ఇది తెలియజేస్తోంది. మార్చి 2026 నాటికి బిడ్లు ఖరారవుతాయని భావిస్తున్నారు. ప్రాజెక్టులు కేటాయించిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. అలాగే 2.5 ఏళ్ల కాల పరిమితిలో వీటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

కేంద్ర మంత్రి వర్గం ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ క్యాపిటల్ రీజియన్ రింగు రోడ్డు (భువనేశ్వర్ బైపాస్) ప్రాజెక్టుకు ఆమోద ముద్ర వేసింది. రామేశ్వర్ నుంచి టాంగీ వరకు హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్‌ఏఎం) విధానంలో 111కి.మీ. పొడవైన రోడ్డును మూడు ప్యాకేజీలుగా ఈ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.8,307.74 కోట్లు. సుమారుగా 96 శాతం మేర భూసేకరణ పూర్తయింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అటవీ, వన్యప్రాణి, పర్యావరణ అనుమతులు సైతం పూర్తయ్యాయి.ప్రాంతీయ అనుసంధానాన్ని, భువనేశ్వర్, కటక్, ఖోర్ధా పట్టణ ప్రాంతాల్లో రద్దీని తగ్గించి రవాణాను ఈ క్యాపిటల్ రీజియన్ రింగు రోడ్డు (భువనేశ్వర్ బైపాస్) మెరుగుపరుస్తుంది. ఈ నియంత్రిత ప్రవేశం కలిగిన ఈ కారిడార్ ప్రాంతీయ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. పెద్ద మొత్తంలో ఉద్యోగావకాశాలను కల్పిస్తుంది.

# 225 మాటలతో శంకరనారాయణ కొత్త పుస్తకం..



హైదరాబాద్, ఫిబ్రవరి 12: త్యాగరాయ గానసభ.. హాస్యావధానాలతో ప్రజలను రంజింపజేసే హాస్య బ్రహ్మ సీనియర్ పాత్రికేయుడు శంకర నారాయణ హాస్యాన్ని, చమత్కారాన్ని రంగరించి తెలుగు పత్రికల్లో రెండు అర్థాలు వచ్చేట్టు 12వేల కొత్త మాటలను సృష్టించారని, ఈ కోవలో 'ఫన్'దిరి అంటూ 225 మాటలతో కొత్త పుస్తకాన్ని రచించారని త్యాగరాయ గానం సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పేర్కొన్నారు. గతంలో ఫన్ గన్, ఫన్ దేహాలు, పన్ పరాగ్, పన్ చామృతం వంటి రచనలతో పాఠకులను అలరింపజేశారని ఆయన అన్నారు.

శంకరనారాయణ కొత్తగా రచించిన 'పన్'దిరి పుస్తకాన్ని త్యాగరాయ గానసభలో కళా జనార్ధనమూర్తి ఆవిష్కరించారు. తన రచనలతో, హాస్య కార్యక్రమాలతో శంకరనారాయణ లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న పాటల రచయిత, స్వరకర్త, గాయకుడు రాయారావు విశ్వేశ్వర్ రావు పుస్తక సమీక్ష చేస్తూ ఈ పుస్తకంలోని మాటలు హాస్యాన్ని పండిస్తూ హాయిగా నవ్వుకునే విధంగా, ఆలోచింపజేసే విధంగా ఉన్నాయని అన్నారు. కొన్ని శృంగారభరితంగా ఉండి ఆకట్టుకునే విధంగా ఉన్నాయని వారన్నారు.

మరో విశిష్ట అతిథి భూపతి కృష్ణ కుమార్ మాట్లాడుతూ శంకరనారాయణ హాస్య కార్యక్రమాలలో పాల్గొని ఆనందించానని అంటూ 'పన్'దిరి పుస్తకంలోని కొన్ని సూక్తులను ఉదాహరించారు. 'పన్'దిరి పుస్తక రచయిత కళారత్న, హాస్యబ్రహ్మ శంకరనారాయణ మాట్లాడతూ పత్రికలలో తాను రాసిన హాస్య రచనలు, అవధానాలలో అప్రస్తుత ప్రసంగాలకు అలాగే హాస్యావధాన సృష్టికి దోహదపడ్డాయని కొత్త కళా జీవితాన్ని తనకు ప్రసాదించాయని, త్యాగరాయ గానసభ తనకు కళా జన్మభూమి అని అన్నారు. త్యాగరాయ గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి ఈ కార్యక్రమ వందన సమర్పణ చేశారు.

# యాదగిరీశుడి ఆశీస్సులతో 'యుఫోరియా' మరిన్ని అద్భుతాలు : గుణశేఖర్



యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 12 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆశీస్సులతో తమ తాజా మూవీ 'యుఫోరియా' మరిన్ని అద్భుత విజయాలు సాధిస్తుందని ప్రముఖ సినీ దర్శకుడు గుణశేఖర్ అన్నారు. గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ఆలయం అత్యద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. స్వామి వారు మహా మహిమాన్వితమైనటువంటి శక్తి గల దేవుడు అని, ఆయన దయతో ప్రతి ఒక్కరూ బాగుండాలని ఆకాంక్షించారు. తాను తరచుగా యాదగిరిగుట్టకు వస్తుంటానని తెలిపారు. స్వామి వారి ఆశీస్సులతో తమ సినిమాలు మంచి విజయాలు సాధిస్తున్నట్లు చెప్పారు. వీలైతే భవిష్యత్‌లో యాదగిరిగుట్ట స్వామి వారిపై మంచి స్క్రిప్ట్ తయారు చేసి సినిమా తీసే ఆలోచనను చేస్తామని తెలిపారు.

కాగా తమ లేటెస్ట్ మూవీ యుఫోరియా మంచి విజయం సాధించిందని అన్నారు. పేరెంటింగ్ పైన తీసినటువంటి ఈ సినిమా అందరి ఆదరణను చూరగొంటుందని తెలిపారు. తమ సినిమా మరింత పెద్ద ఎత్తున విజయం సాధించాలని కోరుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేడుకున్నామని తెలిపారు. ఈ మూవీని అన్ని వర్గాల వారు థియేటర్లలో చూసి ఆదరించాలని కోరారు. ఈ సినిమా కేవలం థియేటర్లలో మాత్రమే చూడడానికే తీశామని తెలిపారు. ఓటిటి కోసం ఎదురు చూడవద్దని ప్రతి ఒక్కరూ థియేటర్ కు వచ్చి తమ మూవీని చూసి ఆదరించాలని కోరారు. ప్రతి ఒక్కరు థియేటర్‌కు వచ్చి ఈ సినిమా చూస్తే ఇందులో ఉన్న మంచి కంటెంట్ ఏమిటి అన్నది తెలుస్తుందన్నారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా తీసిన ఈ సినిమాకు అంతటా విశేష స్పందన లభిస్తుందని, నేటి సమాజంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి, వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశాలను ప్రస్తావిస్తూ ఈ సినిమా తీసినట్లు తెలిపారు. వాస్తవ సంఘటనల ఆధారంగా ప్రస్తుత పరిస్థితులపై తీసిన ఈ మూవీలో మంచి భావోద్వేగాలు ఉన్నాయని, ఈ సినిమా చూసిన ప్రతి ఒక్కరు తమ సినిమాకు కనెక్ట్ కావడం ఖాయమని అన్నారు. ఆయన వెంట యుఫోరియా మూవీ హీరో విగ్నేష్ గవిరెడ్డి, లూరా ఫిలిమ్స్ సభ్యులు, షార్ట్ ఫిలిం డైరెక్టర్ శ్రేయస్, సినిమా యూనిట్ సభ్యులు ఉన్నారు.

# 3 నెలల్లోనే సతీలీలావతి షూటింగ్ పూర్తి చేశా : లావణ్య త్రిపాఠి



హైదరాబాద్, ఫిబ్రవరి 12: టాలీవుడ్ భామ లావణ్య త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి. తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్.. టీజర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఈ మూవీ ప్రమోషనల్ ఈవెంట్‌లో మార్చి 6న సినిమాను రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

ఈవెంట్‌లో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలుపెట్టినప్పుడు నేను ప్రెగ్నెంట్‌ని. కేవలం 3 నెలల్లోనే షూటింగ్ పూర్తి చేశాను. దర్శకనిర్మాతల సపోర్ట్ వల్లే షూటింగ్ చేయగలిగాను. సప్తగిరితో పనిచేయడం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో దేవ్ మోహన్ నటన అందరినీ ఇంప్రెస్ చేస్తోంది. ఎంటర్‌టైనింగ్‌గా సాగే చిత్రం సతీలీలావతి. ఈ సినిమా అందరికీ నచ్చుతుందని.. మార్చి 6న సినిమాను చూసి పెద్ద హిట్ చేస్తారని కోరుకుంటున్నానంది లావణ్య త్రిపాఠి. కమల్ హాసన్ నటించిన సతీ లీలావతితో నా సినిమాను పోల్చనని డైరెక్టర్ తాతినేని సత్య అన్నాడు. అందరూ రిలేట్ అయ్యేలా.. అందరికీ కనెక్ట్ అయ్యేలా సినిమా తీశామని.. మార్చి 6న మూవీని చూసి అందరూ ఎంజాయ్ చేస్తారని ధీమా వ్యక్తం చేశాడు. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

# మహీంద్రా యూనివర్శిటీలో టెడ్‌ఎక్స్




హైదరాబాద్, ఫిబ్రవరి 12: భవిష్యత్తు అనేది ముందే రాసిపెట్టిన పుస్తకం కాదని, అది మనం రాసుకోగలిగే ఒక ఖాళీ పేజీ అని చాటిచెబుతూ మహీంద్రా యూనివర్సిటీలో టెడ్‌ఎక్స్ 2026 నిర్వహించారు. 'అన్‌రిటెన్ ఫ్యూచర్స్: ఇమాజినింగ్ టుమారో, టుగెదర్' ఇతివృత్తంతో ఈ వేడుక సాగింది. యువత కేవలం వీక్షకులుగా మిగిలిపోకుండా, అర్థవంతమైన మార్పు కోసం తమ మేధోశక్తితో రేపటి ప్రపంచాన్ని నిర్మించే భాగస్వాములు కావాలన్నదే దీని లక్ష్యం. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేడూరి మాట్లాడుతూ ఈ ఏడాది ఇతివృత్తం మా నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. విద్య అంటే కేవలం ప్రపంచాన్ని ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోవడం మాత్రమే కాదని, భవిష్యత్తులో ఏమి జరగబోతుందో నిర్వచించేలా మా విద్యార్థులను సన్నద్ధం చేయడమే మా లక్ష్యమన్నారు. మహీంద్రా యూనివర్సిటీలో యువ ఆలోచనాపరులు ధైర్యంగా ఊహించేలా, ఒక ఉద్దేశ్యంతో పని చేసేలా, కలుపుగోలుతనం, కరుణ, ప్రభావవంతమైన భవిష్యత్తును నిర్మించేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ? పరివర్తనకు కేవలం అంచెలంచెలుగా సాగే పురోగతి కంటే అంతకుమించిన కృషి అవసరమని వక్తలు వివరించారు. ఆలోచనలు విజయాన్ని నిర్వచించే విధానాన్ని ప్రాథమికంగా పునర్నిర్మించేలా ప్రోత్సహించాయని తెలిపారు. పోటీ, ఫలితాల ప్రాతిపదికన కాకుండా.. సేవాభావం, కరుణ, దీర్ఘకాలిక ప్రభావం వైపు దృష్టి సారించాలని సూచించారు. ?అన్ని సెషన్లలోనూ ఒక కీలకమైన అంశం పదే పదే వినిపించింది. బాహ్యంగా చేసే ఆవిష్కరణలు మన అంతర్గత ఆలోచనలతో సమన్వయం కలిగి ఉండాలి. అంతర్గత మార్పు కూడా చాలా అవసరమని, వ్యక్తిగత ఆలోచనా విధానాన్ని పునర్నిర్మించుకోవాలని వక్తలు చెప్పారు. నిరంతర మార్పులను తట్టుకుని నిలబడటానికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఎమోషనల్ రెసిలెన్స్ (భావోద్వేగ స్థితిస్థాపకత), ధైర్యం, లక్ష్యాలను ఏకీకృతం చేసే సమగ్ర వృద్ధి అవసరమని ఈ చర్చలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో పూర్ణత వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అబూ వర్గీస్, గ్యాప్‌స్కిల్స్ లెర్నింగ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు డాక్టర్ భూలక్ష్మి, ఐఐఎస్సీ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ సస్టైనబుల్ టెక్నాలజీస్ చైర్ డాక్టర్ జీ మాధవి లత, ఎర్త్ బ్రిగేడ్ ఫౌండేషన్ (ఎన్జీఓ) డైరెక్టర్, కో-ఫౌండర్ డాక్టర్ సరిత సుబ్రమణ్యం, సైబర్ సెక్యూరిటీ లీడర్ స్క్వాడ్రన్ లీడర్ నీరజ్ శర్మ (రిటైర్డ్), ఎడ్యువిజన్ టీఎల్‌ఎస్ సీఎస్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, మెటా క్లయింట్ పార్టనర్ షరణ్‌బీర్ కౌర్, హ్యూమన్ పొటెన్షియల్ టెక్నాలజిస్ట్ వివేక్ సుందరం పాల్గొన్నారు.

# కారేపల్లిలో కార్మికుల ర్యాలీ.. సార్వత్రిక సమ్మె విజయవంతం

ఖమ్మం, ఫిబ్రవరి 12: సార్వత్రిక సమ్మెను పురస్కరించుకుని వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కారేపల్లి మండల కేంద్రంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. మండల కార్యాలయాల నుండి ర్యాలీ ప్రారంభమై బస్టాండ్ సెంటర్ వరకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను నిరసించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు కె.నరేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండబోయిన నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్, ఐక్య రైతు కూలీ సంఘం నాయకులు తేజానాయక్, పీవైఎల్ నాయకులు భూక్య శివ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కేలోత్ రవి, జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌కె.హుస్సేన్, మండల కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్.నాగమణి, హెల్త్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎల్లబోయిన రాధ, మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల, ఈశ్వరి, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు ఆరెళ్ల శ్రీరాములు, పెయింటర్స్ యూనియన్ నాయకులు శివకేశవ, జన్నీ, ఎండీఎం వర్కర్స్‌యూనియన్ నాయకులు ఎం.స్వరూప, విక్టోరియా, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, టీయూసీఐ నాయకులు దారావత్ సక్రు, వడ్డే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# టీటీడీకి ఐదు బ్యాటరీ బగ్గీలు విరాళం

తిరుపతి, ఫిబ్రవరి 12: చెన్నైకు చెందిన జీ స్క్వేయర్ రియల్టర్స్ ఎండీ బాలా రామజయమ్ గురువారం టీటీడీ ( ఋఆ ) కి రూ.33 లక్షల విలువైన ఐదు బ్యాటరీ బగ్గీలను ( ఃజీబిబివతీఎ ఃబీణణతివబ ) విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయం ఎదురుగా ప్రత్యేక పూజలు నిర్వహించి టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి తాళాలను అందజేశారు.

టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ. 10,00,116 విరాళాన్ని తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ తనయుడు కుప్పాల నీలేష్ కుమార్ అదనపు ఈవోకు అందజేశారు.

# వాటర్ ట్యాంకర్‌లో మంటలు..మరోసారి నిర్లక్ష్యం బట్టబయలు



ఖమ్మం, ఫిబ్రవరి 12: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వెంకటేష్ ఖని ఓపెన్ కాస్ట్‌లో మరోసారి వాహనంలో మంటలు చెలరేగడం ఆందోళన కలిగించింది. దుమ్ము నియంత్రణ కోసం నీటిని స్ప్రే చేసే వాటర్ ట్యాంకర్ నంబర్-4లో గురువారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. గత నెల 31న వోల్వో వాహనంలో మంటలు చెలరేగిన ఘటన ఇంకా మరువక ముందే 15 రోజుల వ్యవధిలో మరో వాహనంలో మంటలు చెలరేగడం భద్రతా చర్యలపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. ప్రమాదం జరిగినప్పుడు తాత్కాలిక హడావుడి చేయడం తప్ప శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవడం లేదని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఇప్పటికే చాలా వాహనాలకు ఫిట్‌నెస్ లేదని నాయకులు ఆరోపించిన విషయం తెలిసిందే. వరుస ప్రమాదాలు ఆ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు స్పందించి అన్ని వాహనాల ఫిట్‌నెస్‌పై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమైన కాంట్రాక్టర్ రాష్ట్రంలోని ప్రముఖ నాయకుడికి సన్నిహితుడు కావడంతోనే చర్యల్లో అలసత్వం చూపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయని వారు అంటున్నారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com